ANDHRA JYOTI, Vijayawada. Regd. No. 375 ★★★ Telephone: 1343

చందాలేటు

	పోస్టులేకుండా	పోస్టులతో
	రు. నై.	రు. నై.
సంవత్సరానికి	28.00	31.00
ఆరు మాసాలకు	14.00	15.50
మూడు మాసాలకు	7.00	7.90
ఒక మాసానికి	2.40	2.65

సర్క్యులేషన్ మేనేజర్.
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

120281

ప్రాసెస్ బ్లాకులు
ఆఫిబాస్, లైన్ బ్లాకులు
సకాలంలో చేయియ్యగలము
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

సంపుటి 3 :: సంచిక 239 | విజయవాడ, మార్చి 12, 1963 మంగళవారం | 6 పేజీలు :: 7 నయాపైసలు

కాశ్మీర్ పై కలకత్తా చర్చలకు అమెరికా, బ్రిటన్ ల కొత్త ప్రతిపాదన

తాత్కాలిక పరిష్కారంగా కాశ్మీర్ లోయను తటస్థ ప్రాంతంగా చేయవలెనట

ఢాకాలో పాక్ విదేశాంగ మంత్రితో వాషింగ్టన్, లండన్ రాయబారుల అత్యవసర సమాలోచనలు

ఢాకా, మార్చి 11—

పాకిస్తాన్‌లోని అమెరికా రాయబారి శ్రీ వాల్టర్ మెక్‌నాటీ నిన్న కరాచీ నుంచి ఇక్కడకు వచ్చి పాక్ విదేశాంగ మంత్రి శ్రీ భుట్టోతో చర్చలు జరిపారు.

కాశ్మీర్‌పై కలకత్తా చర్చలకు కొత్త ప్రతిపాదనగా కాశ్మీర్ లోయను తటస్థ ప్రాంతంగా చేయాలన్న పథకాన్ని అమెరికా, బ్రిటన్ ప్రతినిధులు శ్రీ భుట్టోతో జరిపిన చర్చలలో సూచించినట్టు ఢాకా పత్రికలు వెల్లడించినవి.

బ్రిటిష్ హైకమిషనర్ సర్ మారిస్ జేమ్స్, శ్రీ భుట్టోల మధ్య చర్చలు జరిగి 24 గంటలలోనే అమెరికా రాయబారి ఢాకా రావడాన్ని పరిశీలకులు చాలా ముఖ్యమైన విషయంగా పరిగణమిస్తున్నారు అందులో కాశ్మీర్ సమస్యపై రేపు కలకత్తాలో నాలుగవ పక్షం చర్చలు ప్రారంభం కానున్న సమయంలో మెక్ నాటీ రాక విశేషమైనదిగా భావిస్తున్నారు.

కలకత్తా చర్చలలోని పాక్ ప్రతినిధి వర్గం సభ్యులు నిన్ననే ఇక్కడకు వచ్చారు. మార్చి 12 వ తేదీ ఉదయం వీరు శ్రీ భుట్టోతో కలసి కలకత్తా వెళతారు.

పాకిస్తాన్‌లో బ్రిటిష్ దౌత్య ప్రతినిధి సర్ మారిస్ జేమ్స్, శ్రీ భుట్టోల మధ్య మొన్న అనుకోకుండా జరిగిన సమావేశంపై స్థానిక పత్రికలు పలురకాలుగా ఊహాగానాలు చేశాయి. కలకత్తాలో చర్చలలో "కొత్త అంశాన్ని" ప్రవేశపెట్టడానికి అమెరికా, బ్రిటన్‌లు యత్నిస్తున్నవని, కాశ్మీర్ లోయను తటస్థ ప్రాంతంగా చేయడానికి ఆంగ్లో - అమెరికన్లు సంకల్పించారని ఆ పత్రికలు పేర్కొన్నవి.

ఢాకానుంచి ప్రచురితమయ్యే ఆంగ్ల దినపత్రిక "పాకిస్తాన్ అబ్జర్వర్" మొన్న నేషనల్ అసెంబ్లీలో ప్రతిపక్షనాయకులు కాశ్మీర్ సమస్యపై చర్చల గురించి చేసిన ప్రసంగాలను ఈ సందర్భంలో ప్రస్తావిస్తూ, ఇండియాతో రహస్య ఒప్పందం కుదుర్చుకొనడానికి పాకిస్తాన్ యత్నిస్తున్నట్టు ఈ ప్రసంగాల దోరణివల్ల విశద మవుతున్నదని తెలియజేసింది.

పతిపక్ష నాయకులలో ఒకరైన సర్దార్ బహదూర్ ఖాన్ మాట్లాడుతూ అమెరికన్లు ఏది చెప్పితే దానిని వారు (అధికార వర్గం వారు) ఆమోదిస్తారని తమకు తెలుసునని అన్నట్టు ఈ పత్రిక వెల్లడించింది.

కలకత్తా చర్చలు విఫలమవకుండా కాపాడడానికి బ్రిటన్, అమెరికా సహాయంతో కొన్ని ప్రతిపాదనలను చేసినదని, కాశ్మీర్ తరహా సమస్యలపై ఇండియా పాకిస్తాన్‌లకు మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చలు కొన సాగాలనే ఈ ప్రతిపాదనలను బ్రిటన్ చేసినదని మరొక పత్రిక మార్నింగ్ న్యూస్ వివరించింది.

తుది పరిష్కారం జరిగేవరకు కాశ్మీర్ లోయను తటస్థ ప్రాంతంగా వుంచాలని బ్రిటన్ భావిస్తున్నదని, అంతేకాకుండా ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్, ప్రధాని నెహ్రూ ఉభయదేశాల మిత్రుల మధ్య శిఖరాగ్ర సమావేశం వీలయినంత త్వరలో జరగడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నవని ఆ పత్రిక వెల్లడించింది.

కేరళ ఆహార మంత్రి శ్రీ ఇ. పి. పౌలస్ మార్చి 11 వ తేదీన అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, సోవియెట్ యూనియన్ సమేతంగా కొన్ని విదేశాలతో అరటి పండ్లను ఎగుమతి చేయడానికి గల అవకాశాల గురించి ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలియజేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రాచీన నాణెములు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్ మార్చి 11— 1961-62 వ సంవత్సరంలో హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంకు 2612 పురాతన నాణాలు లభ్యమైనవి. ఇవి భారతదేశాన్ని పరిపాలించిన శాతవాహనులు, రోమన్లు, పశ్చిమ చాళుక్యులు, ఖిల్జీ, బహమనీ, ఆదిల్‌షాహీ, ముఘల్, ఆసఫ్‌జాహీ, బ్రిటిష్‌వారి నాటివి.

గత ఏడాది లభ్యమైన శిల్పాలలో ఉప్పుగుండుకు చెందిన బుద్ధునిప్రతిమ, ఇక్ష్వాకుల కాలంనాటి స్తూపం వలక పేర్కొనదగినవి. ప్రాచీన ఆంధ్ర సంస్కృతిని ప్రతిబింబిస్తున్న ఈ రెండు వస్తువులు గాంధార పద్ధతిలో మలచబడినవి. వివిధ భంగిమలలోవున్న మిగిలిన శిల్పాలు భగవాదారాధనను అభివ్యక్తంచేస్తున్నవి. వీటిలో ప్రముఖమైనవాటిని మ్యూజియం గ్యాలరీలో వుంచారు.

నాగార్జున సాగర్ కింద 150 వేల ఎకరాల సాగు

ఇప్పటి పంట కాలంలోనే నీటి సరఫరా ప్రారంభ మవుతుందని మంత్రి ప్రకటన

శ్రీశైలం ప్రాజెక్టుకు త్వరలోనే కేంద్రం అనుమతి లభించగలదని ఆశిస్తున్నట్టు శ్రీ సుబ్బారెడ్డి వెల్లడి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, మార్చి 11—

ఆంధ్ర ప్రదేశ్ ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి గారు నేడు అసెంబ్లీలో ఇరిగేషన్ డిమాండును చర్చకు ప్రతిపాదిస్తూ, నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో నిల్వ కాగల కొంత నీటిని కృష్ణా డెల్టాలో రెండవ పంట సాగుకు వినియోగించడంతో ఈ పంట కాలంలోనే ఈ ప్రాజెక్టు కింద నీటిపారుదల ప్రారంభ మౌతుందని తెలియ జేశారు.

ప్రస్తుత పంట కాలంలో దాదాపు 1.5 లక్షల ఎకరాలకు, 1963 వ సంవత్సరపు పంట కాలంలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీరు పరంగం సాధ్యమౌతుందని ఆశిస్తున్నట్టు మంత్రి శ్రీ సుబ్బారెడ్డి ప్రకటించారు.

తుంగభద్ర ఎగువ కాల్వ గురించి తెలియజేస్తూ, 1,125.00 పట్టంవంకు నిర్మాణం పూర్తి అయిందని. అంతకుపైన జరగవలసిన పని కొనసాగుతున్నదని, మధ్య పెన్నా దక్షిణపు కాల్వ త్రవ్వకం 34 మైళ్ల వరకు పూర్తి అయిందని. ఉత్తరపు కాల్వ త్రవ్వకం పూర్తికావస్తున్నదని ఆయన అన్నారు. ఉరవకొండ పాయకు సంబంధించిన పని ప్రారంభం కానున్నదని ఆయన చెప్పారు.

మంత్రి శ్రీ సుబ్బారెడ్డి తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు:—

"మధ్య తరహా ప్రాజెక్టు అయిన పోచంపాడు ప్రాజెక్టు విషయంలో ప్రణాళిక సంఘవారి సాంకేతిక ఆమోదం లభించవలసి వున్నది. దానివల్ల 3.6 లక్షల ఎకరాలకు నీటి పారుదల జరుగుతుందని అంచనా. ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకోసం రాష్ట్రపు మూడవ ప్రణాళికలో వేసిన కేటాయింపు మొత్తం 400 లక్షలు, 1963 - 64 బడ్జెట్టులో ఈ ప్రాజెక్టుకోసం రు. 15 లక్షలు కేటాయించాము."

"వరద నివారణ కార్యక్రమం కోసం మూడవ ప్రణాళిక కాలంలో నీటి పారుదల రంగంకింద చివరకు రు 200 లక్షలు మొత్తం కేటాయించాము. గోదావరి వరద కట్టల ఎత్తు పెంచే పని పూర్తి కావడం వంశధార,

(మిగతా ఎనిమిదవ కాలంలో)

స్వచ్ఛంద సేవాదళాలలో చేరండి
దేశ రక్షణ కృషిలో మీ పాత్ర
మీరు వహించండి

యమున లోయ జల విద్యుత్ ప్రాజెక్టు

మొదటి దశ తృతీయ ప్రణాళికలో పూర్తికాగలదని మంత్రి ప్రకటన

డెహ్రాడూన్, మార్చి 11 — యమున లోయ జల విద్యుత్ ప్రాజెక్టు మొదటి దశ తృతీయ ప్రణాళికలోనే పూర్తికాగలదని కేంద్ర నీటి పారుదల విద్యుచ్ఛక్తిశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఒ.వి. అలగేశన్ నిన్న ఇక్కడ చెప్పారు.

మొదటి దశకు కావలసిన మొత్తం యంత్ర సామగ్రిని యుగోస్లావియా సరఫరా చేస్తున్నదని అందువల్ల విదేశీ మారక ద్రవ్యానికి సంబంధించిన చిక్కులు ఏవీ ఉండవని ఆయన అన్నారు.

సైప్రస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుచుక్

నేడే హైదరాబాద్ ఆగమనం

హైదరాబాద్, మార్చి 11— ప్రస్తుతం ఇండియాలో పర్యటన జరపుతున్న సైప్రస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎఫ్. కుచుక్ రేపు హైదరాబాద్ వస్తారు.

ఆయన నగరంలో వున్నప్పుడు సాలార్ జంగ్ మ్యూజియం, మెక్కా మసీదు, చార్మినార్‌లను సందర్శిస్తారు.

ఆయన గౌరవార్థం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రేపు విందుచేస్తున్నది.

ఆయన బుధవారం ఉదయం నాగార్జున సాగర్ ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడి నుంచి ఆయన విమానంలో బయలుదేరి పూనా వెళతారు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలు

పరిష్కరించుకొనడానికి ద్వైపాక్షిక చర్చలు అవసరమని చైనా, రష్యాల అంగీకారం

పెకింగ్, మార్చి 11

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై ద్వైపాక్షిక సంభాషణలు జరపవలసిన అవసరం కలదని చైనీస్, రష్యన్ పార్టీలు అంగీకరించినట్టు నవచైనా వార్తా సంస్థ నిన్న రాత్రి తెలియజేసింది.

రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీ కేంద్ర సంఘాల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో వీరు దానికి అంగీకరించినట్టు ఆ వార్తా సంస్థ పేర్కొన్నది.

చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి పెంగ్ సిమో సింగ్ నిన్న రష్యన్ రాయబారి, రష్యన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అయిన చెర్వోనెంకోను కలుసుకొని సోవియెట్ సెంట్రల్ కమిటీ లేఖను సమర్పించారు.

చైనా రష్యా గతనెల 21 వ తేదీన వ్రాసినట్టు పేర్కొనబడడం ఇదే ప్రథమం అయితే ఆ లేఖ వివరాలు మాత్రం తెలియడం లేదు.



సైప్రస్ వైస్-ప్రెసిడెంట్ డాక్టర్ ఫజిల్ కుచుక్, శ్రీమతి కుచుక్ మొన్న రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నెహ్రూను కలుసుకొన్నప్పటి చిత్రం

అరబ్ ప్రపంచంలో నూతన పరిణామాలు

ప్రజల సమైక్యకాంక్షను ప్రతిబింబిస్తున్నవని అరబ్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ నాసర్ ప్రకటన

విప్లవం ఎగుమతిచేసే వస్తువుకాదని స్పష్టీకరణ

లండన్, మార్చి 11—

అరబ్ జాతీయత "ఎగుమతి వ్యాపారం" వంటిది కాదని ప్రెసిడెంట్ నాసర్ నిన్న రాత్రి ఇక్కడ ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో ఉద్ఘాటించారు.

బ్రిటన్‌కు చెందిన అసోసియేటెడ్ టెలివిజన్ సంస్థవారు కయిరోలో శ్రీ నాసర్‌తో జరిపిన ఇంటర్వ్యూలో ఆయన పైవిధంగా చెప్పారు.

ఈ జిప్టు శక్తి సామర్థ్యాలను స్వదేశ వ్యవహారాల పైకంటే అరబ్ ప్రపంచంపైపు కేంద్రీకరించడం వ్యర్థకాదా? అని ప్రశ్నించగా అరబ్ రాజ్యాలలో పరిస్థితి నాలా మంది అవగాహన చేసుకోనలేదని అరబ్ జాతీయత "ఎగుమతివ్యాపారం"వంటిది కాదని ఆయన స్పష్టం చేశారు.

అరబ్ జాతీయత అంటే అరబ్ ప్రజలందరినీ సమీకరించడమని వారి అభిప్రాయాలతో లక్ష్యాలతో సమైక్యాన్ని సాధించేదని వివరిస్తూ ఆయన ఇంకా ఇలా అన్నారు:

"అంటే అరబ్ ప్రపంచం స్వాతంత్ర్యం కాపాడటం విదేశీయుల బలానికి లొంగకుండా వుండడం ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడం అరబ్ జాతీయత లక్ష్యం"

అరబ్ సమైక్య సాధనే లక్ష్యం అంటే అరబ్ రిపబ్లిక్‌నుంచి ఇతర అరబ్ దేశాలకు విప్లవాన్ని విస్తృత పరచడమా అన్న ప్రశ్నను ఆయన ఖండించారు.

ఈజిప్టులో జరిగినటువంటి విప్లవమే జయప్రదంగా మరొక అరబ్ దేశంలో జరిగితే దాన్ని అరబ్ రిపబ్లిక్ బలపరచడమౌతుందని నాసర్ అన్నారు.

"మధ్య ఆసియా విషయంలో బ్రిటన్ తన విధానాలను పునఃపరిశీలించాలి"

మధ్య ఆసియాపట్ల బ్రిటన్ తన వైఖరిని పునః పరిశీలించాలని "సన్‌డే టైమ్స్" పత్రిక నిన్న సూచించింది. ఈ విషయమై బ్రిటిష్ విదేశాంగ శాఖలో ఉపమంత్రి ఎడ్వర్డ్ హీత్ కయిరోతోనహా మధ్య ఆసియా దేశాలలో పర్యటించాలని ఆ పత్రిక సూచించింది.

అరబ్ పునరుజ్జీవనానికి ప్రెసిడెంట్ నాసర్ చిహ్నమని ఆ పత్రిక వర్ణించింది. సిరియా విప్లవం ఫలితంగా మధ్య ఆసియా విషయంలో తమ వైఖరిని పునః పరిశీలించవలసిన అవసరం పెరిగిందని ఆ పత్రిక తన సంపాదకీయంలో పేర్కొన్నది.

అరబ్ రాజ్యాల సమష్టి సైనికదళం

అయిదు రాజ్యాల సమష్టి సైనిక దళాన్ని ఏర్పాటు చేయాలని ఇరాక్ ప్రతిపాదించినదని బాగ్దాద్ రేడియో నిన్న ప్రకటించింది.

సిరియా, అరబ్ రిపబ్లిక్, జోర్డేనియా, ఎమెన్‌లకు ఇరాక్ ఈ సూచన చేసింది.

ఈ సమష్టి సైనికదళంలో పాల్గొన్న దేశాల ప్రభుత్వాలపై సామ్రాజ్యవాదుల తోడ్పాటుతోకాని ఆభివృద్ధి నిరోధకుల తోడ్పాటుతోకాని ఏదైనా కుట్ర జరిగిన పక్షంలో ఆ దేశం వ్యవహారాలలో ఈ సమష్టి సైనిక దళానికి హక్కు వుండే విధంగా ఒక ఒప్పందాన్ని రూపొందించాలని ఇరాక్ సూచించింది.

అయిదు దేశాల సైనికాధికారులతో కూడిన ఒక ఉన్నత దళాన్ని ఏర్పాటు చేయాలని కూడా బాగ్దాద్ సూచించింది. ఈ అయిదు దేశాలలోని సాయుధ దళాలన్నీ ఈ ఉన్నతాధికార దళానికి లోబడి పని చేయాలని ఇరాక్ ప్రతిపాదించింది.

నిన్న డమాస్కస్ వచ్చిన ఇరాక్ అధికార ప్రతినిధివర్గం ఈ ప్రతిపాదన చేసింది.

ఇరాక్ ప్రతిపాదనకు సిరియా అంగీకారం

ఇది ఇలా వుండగా ఇరాక్ ప్రతిపాదనలకు సిరియా ఆమోదించినట్టు ప్రధాని సలాల్ ఎల్ బిటార్ నిన్న డమాస్కస్‌లో ఒక విందులో చెప్పినట్టు కయిరో రేడియో ప్రసారం చేసింది.

డమాస్కస్‌లో ప్రదర్శనలు

డమాస్కస్ వీధులలో నిన్న నాసర్

(మిగతా 2 వ పేజీలో)

తాజా వార్త

మాడ్రిడ్, మార్చి 11—కీన్యా ఉత్తర సరిహద్దు జిల్లాలో అమలుపరిస్తున్న విధానాల కారణంగా బ్రిటన్‌తో దౌత్య సంబంధాలను తెగ్గు చేసుకొనడానికి తన ప్రభుత్వం నిశ్చయించిందని స్పానిష్ ప్రధాని అడ్రిడిస్ అల్ సెమ్మార్కె నేడు పార్లమెంట్‌లో ప్రకటించారు.

[2 వ కాలం తరువాయి]

నాగార్జున, శారద, వరాహనది లోయలలోని వరద కట్టలకు మరమ్మతులు చేయడం ఈ సంవత్సరపు కార్యక్రమంలో చేపట్టినాయి.

"చిన్న తరహా నీటిపారుదల పథకాల కోసం 1963-64 వ సంవత్సరపు ప్రణాళికలో రు 243 లక్షల మొత్తం కేటాయించాము. ఈ కేటాయింపును నాలుగు కోట్లకు పెంచే అవకాశం వున్నది."

విద్యుచ్ఛక్తి పథకాలు

మంత్రి శ్రీ సుబ్బారెడ్డి అసెంబ్లీలో విద్యుచ్ఛక్తి శాఖ డిమాండును చర్చకు ప్రతిపాదిస్తూ, ఇలా అన్నారు:

"విద్యుచ్ఛక్తి రంగంలో వినియోగానికి మొదట రు 64.94 కోట్ల మొత్తాన్ని ప్రత్యేకించారు. ఈ రంగానికి మరికొంత డబ్బు అత్యవసర మన్న దృష్ట్యా పై మొత్తాన్ని రు 68.64 కోట్లకు పెంచడం జరిగింది. విద్యుచ్ఛక్తి పథకాలకు కేటాయింపును ఇంకా అధికం చేయడానికి గల అవకాశాలను గురించి పరిశీలిస్తున్నాము.

"శ్రీశైలం - నాగార్జునసాగర్ జలవిద్యుచ్ఛక్తి పథకాన్ని ప్రణాళికా సంఘంవారు ఆమోదించవలసి వున్నది. ఈ అనుమతి లభించే లోగానే భవనాలు, కలుపు రోళ్లు, నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా వంటి సివిల్ వర్క్సు నిర్మాణాన్ని ప్రారంభించాము. మూడవ ప్రణాళిక లో ఈ పథకానికి రు 800 లక్షల మొత్తం కేటాయించారు. భారత ప్రభుత్వం త్వరలోనే ఈ పథకానికి తమ అనుమతి తెలుపుతారని ఆశిస్తూ బడ్జెట్టులో ఈ పథకం కోసం రు 150 లక్షల మొత్తాన్ని కేటాయించాము.

"కొత్తగూడెం థర్మల్ పథకం విషయంలో ఒక్కొక్కటి 60 మెగావాట్ల శక్తిగల రెండు యంత్రాలను స్థాపించే పథకం ఒకటి మంజూరై మూడవ ప్రణాళికలో స్థానాన్ని పొందింది. దీనికోసం ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తీసికొనడం జరుగుతున్నది. ఇది ఈ నెలలోనే మంజూరు అవుతుందని ఆశిస్తున్నాము.

"విద్యుచ్ఛక్తి పంపకానికి సంబంధించిన అన్ని పనుల నిర్వహణ ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డు అజమాయిషీలో వున్నది.

"బడ్జెట్టును కొంత మేరకు సమపరచే ఉద్దేశంతో బోర్డువారు విద్యుచ్ఛక్తి సరఫరా విషయంలో 1-3-63 తేదీ నుంచి సవరించిన విద్యుచ్ఛక్తి రేట్లను ప్రవేశ పెట్టడానికి నిర్ణయించారు. ఈ సవరించిన రేట్ల ఫలితంగా ఆదనంగా సుమారు రు. 140 లక్షల మొత్తం ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాము. కొత్త రేట్లను ప్రవేశపెట్టిన తర్వాతకూడా బోర్డు ఆదాయం దాని నిర్వహణ ఖర్చులకు పూర్తిగా చాలేటట్టు వుండదు."

అరబ్ లీగ్‌తో సహకరించడానికి ఈజిప్టు నిర్ణయం

ప్రధాన కార్యదర్శి ప్రకటన

కయిరో, మార్చి 11— అరబ్‌లీగ్‌తో తమ కార్యకలాపాలను పునఃప్రారంభించడానికి అరబ్ రిపబ్లిక్ నిర్ణయించిందని అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ హసౌనా నిన్న ఇక్కడ ప్రకటించారు.

ఈ మేరకు తనకు అరబ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి నుంచి ఒకలేఖ అందినదని ఆయన చెప్పారు.

అరబ్ జాతికి సేవచేయవలెనన్న సంకల్పంతో అరబ్‌లీగ్‌తో తమ కార్యకలాపాలను కొనసాగించాలని అరబ్ రిపబ్లిక్ నిర్ణయించినట్టు ఆ లేఖలో పేర్కొనబడిందని హసౌనా చెప్పారు.

కీన్యాలో అల్లరులు

నైరోబి, మార్చి 11—కీన్యా ఎన్నికల ప్రచారం సందర్భంలో ప్రత్యర్థి వర్గాల మధ్య సంఘర్షణలను నివారించడానికి మొంబాసాలో పోలీసులు నిన్న బాష్పవాయువును ప్రయోగించారు.

"కానూ" పార్టీకి చెందిన ఒక యువకుని హత్య చేయడం ఫలితంగా మొంబాసాలో సంఘర్షణలు ప్రారంభమైనవి.

'కాదూ' కార్యదర్శి ఇంటిపై నిన్న రెండు వందలమంది దాడిచేసి తలుపులు పగులగొట్టి అతనిని బాగా కొట్టారు.

ఆ వార్త తెలిసిన వెంటనే పోలీసు దళం అక్కడకు వెళ్ళి గుంపును చెదర గొట్టడానికి బాష్పవాయు ప్రయోగం చేసింది.

బూర్గంపాడులో అగ్నిప్రమాదం

25 ఇళ్లు పరశురామప్రీతి: 12 వేల రూపాయల ఆస్తినష్టం

("ఆంధ్రజ్యోతి" విలేకరి) బూర్గంపాడు, మార్చి 11—

బూర్గంపాడు గ్రామంలోని గొల్ల బజారులో అరవ తేదీ రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి దాదాపు 12 వేల రూపాయల ఆస్తి నష్టం జరిగింది.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఒక పూరింటికి నిప్పంటుకొన్నది. తెల్లవారేసరికి 25 పూరిండ్లు దహనమయ్యాయి.

దాదాపు 12 వేల రూపాయలు విలువగల ఆస్తి నష్టం జరిగి వుంటుందని భావిస్తున్నారు.

వారంలో జులీశం బూర్గంపాడు పంచాయతీ శివారు లక్ష్మీపురం నగరు గ్రామం పరశురామ ప్రీతి అయింది.

1963 మార్చి 12 మంగళవారం
శ్రీ శుభకృతునామసంవత్సర
ఫాల్గుణ బహుళ విదియ
విదియ: సా॥ 5.29
హస్త: రా॥ 8.27
వర్జ్యం: తె॥ 5.25 నుంచి

* * *

1963 మార్చి 13 బుధవారం
శ్రీ శుభకృతునామసంవత్సర
ఫాల్గుణ బహుళ తదియ
తదియ: రా॥ 7.53
చిత్త: రా॥ 11.21
వర్జ్యం: లే. వ. ఉ॥ వంచి 7.13 వరకు
,, తె॥ 5.39 ,, —

ఆంధ్రజ్యోతి

"తమసో మా జ్యోతిర్గమయ"

నెహ్రూ హెచ్చరిక

చైనా ఉత్తరపు సరిహద్దులలో వేసవి త్వరలో ప్రారంభం కానున్నది. హిమాలయ శ్రేణులలో చలి తగ్గి, మంచు కరిగి, జన సంచారానికి అనుకూల్యం ఏర్పడనున్నది. శీతకాలం ప్రారంభం కాక ముందు భారత దేశంపై పెద్దపెట్టున దాడి చేసిన చైనా వేసవిలో తిరిగి దాడి చేయవచ్చు. ప్రధాని నెహ్రూ ఇటీవల కొలంబో రోజులుగా చేస్తున్న హెచ్చరికల సారాంశం ఇదే.

అనవసరంగా ప్రజలకు భయోత్పాతం కలిగించడం మన ప్రధాని ఉద్దేశం కాదు. ఆయన స్వభావం అటువంటిది కాదు. తగినన్ని కారణాలు, ఆధారాలు లేనిదే ఆయన చైనా దురుద్దేశాలను గురించి ఈ విధంగా అనుమానపడి వుండరు; ఈ హెచ్చరికలు చేసి వుండరు.

చైనా తన దండయాత్రను ఉపసంహరించు కొనడానికి హిమాలయ శైతల్యం, సోవియెట్ ఒత్తిడి, భారతీయుల తీవ్ర ప్రతిఘటన, పశ్చిమ రాజ్యాల సహాయం మొదలైనవి ఏవైనా కారణాలై వుండవచ్చు. కాని భారత దేశంపై అవ్యాజానురాగం, హృదయ పరివర్తనం, పశ్చాత్తాపం ఈ కారణాల జాబితాలో లేవని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కొలంబో సభ మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తున్నానని చెబుతూ, ఆ సభ చేసిన ప్రతిపాదనలను చైనా త్రోసిపుచ్చింది. మధ్యవర్తుల ప్రతిపాదనల ప్రాతిపదికపై కాక, తన షరతులపై ఇండియాతో చర్చలు జరుపగలనని చెబుతున్నది. ఇండియా మొదటనే నిరాకరించిన ఆ షరతులను తిరిగి తిరిగి ఉద్ఘాటించడాన్ని బట్టి చర్చలు జరగడం చైనాకు ఇష్టంలేదనే స్పష్టపడుతున్నది. సౌమ్య మార్గం అవలంబించాలని కోరినందుకు, వివాదంలో తటస్థంగా వూరుకున్నందుకు రష్యాతో తగాదా తెచ్చుకున్నది. రష్యాతో సరిహద్దు వివాదానికి కూడా కాలు దువ్వుతున్నట్టు వార్తలు తెలుపుతున్నవి.

ఇవన్నీ ఇలా వుండగా టిబెట్‌లో చైనా భారీ యెత్తున సైన్యాలను కేంద్రీకరిస్తున్నది. మొత్తం టిబెట్ దేశాన్నే యుద్ధ శిబిరంగా మార్చి వేస్తున్నది. ఇండియాతో సమష్టి రక్షణ కృషిలో చేరకుండా చేయడానికి పాకిస్తాన్‌తో సరిహద్దు ఒడంబడిక కుదుర్చుకున్నది.

అయితే, ఇండియా గడచిన అక్టోబరులో వున్నంత నిస్సహాయంగా ఈనాడు లేదు. చైనానుంచి తిరిగి ప్రమాదం ఏర్పడే పరిస్థితిలో ఇండియాకు తాము రక్షణ సహాయం చేయగలమని అమెరికన్ విదేశాంగ మంత్రి డీన్‌రస్క్ మొన్న పునరుద్ఘాటించారు. కాశ్మీర్ సమస్యా పరిష్కారానికి ఆయుధ సహాయానికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

కాని, దేశరక్షణకు అత్యధిక కృషి దేశంలోనే జరగాలన్నది నిర్వివాదం. ఆయుధ కర్మాగారాలను విస్తృతం చేయడం, కొత్తవాటిని స్థాపించడం, ఆధునికాయుధాలను విరివిగా ఉత్పత్తి చేయడం ద్వారానే కాక, వ్యావసాయిక, పారిశ్రామిక రంగాలలో విశేషమైన అభివృద్ధి సాధించడం ద్వారా మన రక్షణ శక్తిని ఇనుమడింపజేయాలి. వచ్చే యేడాది రక్షణకు కేటాయించిన 867 కోట్ల ధనం భారీ మొత్తమే అయినా, మన దేశాన్ని ఎదుర్కొంటున్న విపత్తుతో పోల్చితే అది స్వల్పమే. అందుచేతనే ముమ్మందు మనం ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి, ఎట్టి త్యాగాలైనా చేయడానికి సిద్ధపడాలని ప్రధాని నెహ్రూ ఇటీవల తమ ప్రసంగాలలో తరుచుగా హెచ్చరిస్తున్నారు.

"దేశంలో వడ్డీ వ్యాపారులసంఖ్యను తగ్గించాలి"

చిన్న తరహా బ్యాంకులు తోడ్పడాలని శ్రీ భట్టాచార్య సూచన

మద్రాసు, మార్చి 11—ఐదుగు దేశాల ఆర్థిక వ్యవస్థలో చిన్న తరహా బ్యాంకుల బాధ్యత పెరుగుతున్న దృష్ట్యా వాటి నిర్వహణ పద్ధతులలో మార్పు అవసరమని రిజర్వు బ్యాంకి గవర్నర్ శ్రీ పి. సి. భట్టాచార్య నేడిక్కడ తెలియజేశారు.

దక్షిణ మండలంలో వున్న చిన్న తరహా బ్యాంకుల ప్రధాన నిర్వాహణాధికారుల నిమిత్తం ఏర్పాటు చేసిన గోష్ఠికి శ్రీ భట్టాచార్య ప్రారంభోపన్యాసంచేస్తూ పై విధంగా చెప్పారు. ఈ గోష్ఠిని రిజర్వు బ్యాంకి ఏర్పాటు చేసింది.

చిన్న బ్యాంకులు సమర్థంగా నిర్వహింపబడడానికి రిజర్వు బ్యాంకి పై నుంచి తనిఖీ చేయడంవల్ల మాత్రమే అనుకున్న ప్రయోజనాలు సిద్ధించవని అన్నారు.

బ్యాంకింగు విధానం పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని చూరగొనవలెనంటే, బ్యాంకులు స్వయంగా బ్యాంకింగు సంప్రదాయాలను తక్కగా పాటించడం అవసరమని తెలిపారు దేశంలోని మొత్తం బ్యాంకింగు వ్యాపారంలో చిన్న బ్యాంకుల వాటాకొద్దిగానే వున్నప్పటికి దేశఆర్థికాభివృద్ధికి చిన్నబ్యాంకుల పాత్ర గణనీయ మైనదిగా వుంటుందని శ్రీ భట్టాచార్య వివరించారు.

దేశంలో అధికవడ్డీలను పొందాలనే కాంక్షతో గల వడ్డీవ్యాపారుల సంఖ్యను తగ్గించడంలో చిన్న తరహా బ్యాంకులు బాగా తోడ్పడిన వన్నారు. ఇవి ముఖ్యంగా లఘు పరిశ్రమల రంగానికి తోడ్పడుతున్నవని చెప్పారు. చిన్నబ్యాంకులు తమ వ్యాపారాన్ని పెంపొందించు కొనడానికి లఘుపరిశ్రమల రంగమే ఉపయోగ పడగలదని ఆయన తెలియజేశారు.

రాజేన్‌బాబు నిర్యాణానికి పోర్టులూయిస్ ప్రజల సంతాపం

న్యూఢిల్లీ, మార్చి 11— పోర్టులూయిస్‌లోని మారిషస్ ప్రజలు, భారతీయులు ఇటీవల సమావేశమై ఇండియా తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నిర్యాణానికి సంతాపాన్ని తెలియజేస్తూ ఒక తీర్మానం చేశారు.

మారిషస్ ముఖ్యమంత్రి డాక్టర్ రామ్‌గూలమ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఇండో - మారిషియన్ సంఘం సభ్యులు వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

విజయవాడలో ఉష్ణోగ్రత
విజయవాడ, మార్చి 11— విజయవాడలో నేటి గరిష్ఠ ఉష్ణోగ్రత 100 ఫారన్ హీట్ డిగ్రీలు ఉన్నది.

వైద్య విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటన

అలహాబాద్, మార్చి 11 — ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సి. బి. గుప్తా వచ్చే సంవత్సరంనుంచి వైద్యవిద్యార్థులలో నూటికి 20 మంది మంటికి ఉచిత విద్యా సౌకర్యాన్ని కల్పించగలమని, మరి 20 మంది మంటికి నామమాత్రపు వడ్డీపై అప్పు మంజూరు చేయగలమని, స్కాలర్‌షిప్పుల సంఖ్యను కూడా పెంచగలమని తెలియజేశారు.

మోతీలాల్ నెహ్రూ మెడికల్ కాలేజి వార్షికోత్సవ సభలో శ్రీ గుప్తా ప్రసంగిస్తూ గ్రామప్రాంతాలలోని ప్రజలకు వైద్య సౌకర్యాలను కల్పించడానికి ప్రారంభిస్తున్న అనుపత్రుల నిర్వహణకు డాక్టర్లు హెచ్చుగా కావాలని తెలిపారు.

అరబిక్ భాషాధ్యయనం

ఇండియాలో 13 యూనివర్శిటీలలో ఏర్పాటు

న్యూఢిల్లీ, మార్చి11— ఇండియాలో 13 విశ్వవిద్యాలయాలలో, అరబిక్ భాషలో పరిశోధన తరగతులు ఏర్పాటు చేస్తున్నారు ఇందులో నాలుగు కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాల విశ్వవిద్యాలయాలు వున్నవి.

అలీఘర్, అలహాబాద్, బెనారస్, బీహార్, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, లక్నో, మద్రాస్, పాట్నా, ఉస్మానియా, పంజాబ్, విశ్వభారతి విశ్వవిద్యాలయాలలోను, వాటి అనుబంధ కళాశాలలలోను ఎం. ఎ క్లాసులలో అరబిక్ భాష ప్రవేశపెడుతున్నారు.

ఇండియా, ఐక్య అరబ్ రిపబ్లిక్‌ల సాంస్కృతిక ఒప్పందం క్రింద, ఐక్య అరబ్ రిపబ్లిక్ ఏటా అరబిక్ భాష, ఇస్లాం తత్వం మొదలైన విషయాలపై నాలుగు విద్యార్థి ఉపకార వేతనాలు ఇస్తుంది.

డాక్టర్ కుచుక్ తాజ్‌మహల్ సందర్శన

ఆగ్రా, మార్చి 11— సైప్రస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుచుక్ నిన్న మధ్యాహ్నం తాజ్‌మహల్‌ను సందర్శించారు. హిందూ - ముస్లిం సంస్కృతికి తాజ్ చక్కని చిహ్నమని ఆయన అన్నారు.

ఉస్మాన్ సాగర్, అసిఫ్‌నగర్‌ల మధ్య పైపులలో నీరు 'అదృశ్యం'

—అధికారులకు చిక్కు సమస్య

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, మార్చి 11—

గత కొలది రోజులుగా ఉస్మాన్‌సాగర్, అసిఫ్‌నగర్‌ల మధ్య మంచినీటి సరఫరా పైపులలో నీరు "అకస్మాత్తుగా అదృశ్యమవడం" వాటర్ వర్క్సు శాఖ అధికారులకు పెద్ద చిక్కు సమస్యగా తయారయినది.

ఉస్మాన్ సాగర్, అసిఫ్‌నగర్‌ల మధ్య వ్యవసాయక పనులకు నీటిని "దొంగిలిస్తున్నారని" అధికారులు అనుమానపడుతున్నారు దీని పరిణామంగానే మంచినీరు పైపులో "అదృశ్యమవు"తున్నవని అంతనా వేస్తున్నారు.

ఈ పని చేస్తుండగా చూసినవారు గాని, ఈ పని చేస్తున్నారని అనుమానించి దగిన వ్యక్తిగాని యింతవరకు అచూకి తెలియలేదు.

ఉస్మాన్‌సాగర్, అసిఫ్‌నగర్ మధ్య పైపులైను నిరంతరం కాపలా కాస్తున్నారు.

ఈ పైను లైను పొడవు ఆరు మైళ్ళు ఈ సందర్భంలో పోలీసు అధికారుల సహాయాన్ని కూడా అధికారులు అర్థించారు.

ఉస్మాన్‌సాగర్, అసిఫ్‌నగర్‌ల మధ్య ఈ పైను లైన్‌పై వున్న అనేక తనిఖీ కేంద్రాలలోను, మాన్‌హోల్స్‌లోను ఎప్పటికప్పుడు కొలతలను తీస్తున్నారు. ఈ పద్ధతి మూలంగా సరిగ్గా ఎక్కడ ఈ నీరు "అదృశ్యమవుతున్నదో" అవగతంకాగలదు

ఉస్మాన్‌సాగర్ నగరానికి 12 మైళ్ళ దూరంలో వున్నది. ఇక్కడనుంచి ప్రధానంగా నీరు నగరానికి సరఫరా అవుతుంది.

పెద్ద పైపుల ద్వారా ఇక్కడనుంచి అసిఫ్‌నగర్ నీటిశుద్ధి కేంద్రానికి నీరు విడుదల అవుతుంది. మూసీ నదికి ఉత్తరంగా వున్న నగర ప్రాంతానికి, నీకేంద్రాబాద్‌కు ఈ అసిఫ్‌నగర్ నుంచి మంచినీరు సరఫరా అవుతుంది.

సుమారు నాలుగు రోజుల క్రిందట అసిఫ్‌నగర్ నీటి శుద్ధి కేంద్రంలో నీటి సరఫరా పడిపోయినట్టుగా అధికారులు గమనించారని వాటర్ వర్క్సు శాఖ ప్రతినిధి ద్వారా తెలియవచ్చింది.

వెంటనే తనిఖీ ప్రారంభించారని. అయితే ఉస్మాన్‌సాగర్ నుంచి విడుదల చేస్తున్న నీటి పరిమాణం తగ్గలేదని. అయితే అసిఫ్‌నగర్ వద్ద మాత్రం నీటి సరఫరా పడిపోయినదని తెలియనది.

కాగా ఎక్కడో మార్గ మధ్యంలో నీరు "అదృశ్యమవు" తున్నది.

ఇదే విధంగా నీరు "అదృశ్యమయితే" హోలీ పర్వదినం నాడు నగరానికి అవసరమైన మంచినీరు సరఫరా కాదేమోనని అధికారులు ఆందోళన పడ్డారు.

గత శనివారంనాడు వాటర్ వర్క్సు శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ కృష్ణారావు, తదితర అధికారులు విరామలేకుండా కృషి చేసి, సర్వీసు రిజర్వాయర్‌లో సరిపడినంత నీటిని నిలుప చేయడానికి తోడ్పడిన పరిణామంగా నీటి ఎద్దడి తప్పినది.

నిన్న ఉదయం నుంచి పరిస్థితి మామూలుగానే వున్నది.

ఉస్మాన్‌సాగర్, అసిఫ్‌నగర్‌ల మధ్య ఈ విధంగా నీరు అదృశ్యమవడం గత కొంది సంవత్సరాలుగా జరుగుతున్నట్టు తెలుస్తున్నది అదికూడా ఇక వేసవి వస్తుందనగా ఫిబ్రవరి, మార్చి నెలలలోనే జరుగుతుంది. ఇంతకు పూర్వం, దీని తదుపరి పరిస్థితిలో ఎలాంటి మార్పు వుండదు. ఇదే అధికారులకు పెద్ద చిక్కు సమస్యగా తయారయినది.

ఇందుకు గల మూల కారణాన్ని కనుగొనడానికి వాటర్ వర్క్సు శాఖ అధికారులు కట్టుదిట్టమయిన తనిఖీ, కావలాను ఏర్పాటు చేశారు.

ప్రజల ఇబ్బందులకు గురి కాకుండా వివాంకడానికి ఉస్మాన్‌సాగర్ నుంచి అదనంగా నీటిని విడుదల చేస్తున్నారు.

దేశంలో పవర్ మద్దాం పరిశ్రమ నిర్వహణ గురించి పటిలేవ అరవడానికి శ్రీ అశోక్ మెహతా అధ్యక్షతను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మార్చి 18 వ తేదీన కోయంబత్తూరు సందర్శిస్తున్నది.

దేశ రక్షణ కృషికి సినీ తారల ఉత్సాహం

అగ్రశ్రేణి నటీ నట బృందంచే త్వరలో వివిధ కేంద్రాలలో ప్రదర్శనల సన్నాహాలు

రాయలసీమ, తెలంగాణా, సర్కార్స్ ప్రాంతాలలో వచ్చే మే నెల 17 వ తేదీనుంచి 20 వ తేదీ వరకు ఒక్కొక్క సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆంధ్ర చలనచిత్ర పరిశ్రమ జాతీయ రక్షణ మండలి నిర్ణయించింది.

ఆంధ్ర చిత్ర పరిశ్రమ జాతీయ రక్షణ మండలి ద్వితీయ సమావేశం ఈ నెల ఏడవ తేదీన ఇక్కడ విజయా గార్డెన్స్‌లో జరిగింది

అనంతపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ నెల్లూనా, శ్రీమతి నీలా ఈ సమావేశానికి హాజరయ్యారు.

కళాకారులు గ్రూపులుగా విడి, ఎన్నిక చేసిన కేంద్రాలలో చిన్నచిన్న ప్రదర్శనలను యివ్వాలని నిర్ణయించారు.

రాయలసీమలో ఒక కేంద్రంలోను, తెలంగాణలో మరొక కేంద్రంలోను సర్కారు జిల్లాలలో మరొక కేంద్రంలోను ఈ ప్రదర్శనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వచ్చే మే 17 వ తేదీనుంచి 20 వ తేదీలోపు ఈ ప్రదర్శనలను ఏర్పాటు చెస్తారు.

కళాకారులు మద్రాసునుంచి మే 16 వ తేది రాత్రి బయలుదేరి, వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు యిచ్చి. తిరిగి 21 వ తేదీకి మద్రాసుకు చేరుకుంటారు.

ఈ క్రింది తాత్కాలిక కార్యక్రమాన్ని నిర్ణయించారు.

"దేశం కోసం" అనే సాంస్కృతిక ప్రదర్శనంలో కుమారి జమున, శ్రీ ఎస్. వి. రంగారావు, శ్రీమతి కన్నాంబ పాల్గొంటారు. ఈ ప్రదర్శన అరగంటసేపు వుంటుంది.

"మంచివనసులు" చిత్రం నుంచి ఒక ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. దీనిలో శ్రీమతి సావిత్రి, నాగేశ్వరరావు, శ్రీ ఎస్. వి. రంగారావు శ్రీమతి సూర్యకాంతం పాల్గొంటారు

"రక్తసంబంధం చిత్రం నుంచి మరొక ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. దీనిలో శ్రీ కాంతారావు శ్రీమతి సావిత్రి పాల్గొంటారు ఈ ప్రదర్శన 25 నిమిషాలుపాటు వుంటుంది

"పెళ్ళి పిలుపు" నుంచి మరొక ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన అరగంటసేపు వుంటుంది. దీనిలో శ్రీ రేలంగి, కుమారి జగిరి పాల్గొంటారు.

"అలెగ్జాండర్" నాటకాన్నుంచి ఒక ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. ఈ ఘట్టం 20 నిమిషాలు వుంటుంది. దీనిలో శ్రీయతులు రాజనాల, కా. తారావు, సత్యనారాయణ పాల్గొంటారు.

శ్రీ వర్మనాథం, శ్రీ బాలకృష్ణ ఒక ప్రదర్శనాన్ని యిస్తారు. ఈ ప్రదర్శన 20 నిమిషాలు వుంటుంది.

జాతీయ ఆశయాన్ని ప్రతిబింబించే ఒక నాటకాన్ని శ్రీ ఎం. లింగమూర్తి కూడ స్తారు. ఈ నాటకం అరగంట సేపు ప్రదర్శిస్తారు.

శ్రీ కె. జగ్గయ్య, శ్రీ గుమ్మడి మరొక ప్రదర్శనాన్ని రూపొందిస్తారు.

శ్రీ టి. వి. రామణారెడ్డి ఈ ప్రదర్శనాలలో పాల్గొంటు, మ్యాజిక్ ప్రదర్శనలు యిస్తారు.

శ్రీమతి రాజసులోచన నృత్యం కూడా వుంటుంది.

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు దేశభక్తి ప్రపూరిత గేయాలను గానం చేస్తారు.

శ్రీ ఎస్. టి. రామారావు ప్రదర్శనలకు సారథ్యం వహిస్తారు.

ఆంధ్ర చిత్ర పరిశ్రమను జాతీయ రక్షణ మండలి తృతీయ సమావేశం ఈ నెల 14 వ తేదీన విజయా గార్డెన్స్‌లో జరగుతుంది.

సోషలిస్టు పార్టీల విలీనీకరణ సాధన

శ్రీ రాజ్‌నారాయణ్ సింగ్ వివరణ

కతిహార్, మార్చి 11— అఖిల భారత సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ రాజ్‌నారాయణ్‌సింగ్ మొన్న ఇక్కడ మాట్లాడుతూ, సోషలిస్టు సమైక్య సాధనకు తమ పార్టీ ఇప్పటికీ సంసిద్ధంగానే వున్నదని, ప్రజా సోషలిస్టు పార్టీ ఈ సమస్యను సరియైన దృక్పథంతో అవగాహన చేసుకొని, తమతో సహకరించడం అవసరమని తెలిపారు.

శ్రీ సింగ్ ఇక్కడ బహిరంగసభలో మాట్లాడుతూ. ఉత్తర ప్రదేశ్ శాసనసభలోని ఉభయసభల ప్రతినిధులు ఆమోదించిన సూత్రాల ప్రాతిపదికపై సోషలిస్టు పార్టీల విలీనీకరణ సాధించవలసి వున్నదని తెలిపారు.

కాశ్మీర్‌వంటి సమస్యల పరిష్కారానికి దృఢమైన చర్యలను తీసుకొనవలెనని ఆయన అన్నారు.

దక్షిణాదిలో కెల్ల పెద్ద క్షయ ఆసుపత్రి సంగారెడ్డిలో ఏర్పాటు

మార్చి 23వ తేదీన గవర్నర్‌చే శంకు స్థాపన

హైదరాబాద్, మార్చి11— గవర్నర్ శ్రీ ఎస్. ఎం. శ్రీనగేష్ 23వ తేదీన సంగారెడ్డిలోని పరిశోధనా కేంద్రంలో క్షయ వ్యాధికి శంకు స్థాపన చేస్తారు ఈ ఆసుపత్రి దక్షిణాదిలోకెల్లా పెద్దదిగా భావించబడుతున్నది.

గవర్నర్ శ్రీనగేష్ మార్చి 22,23 తేదీలలో సంగారెడ్డి డివిజన్‌లో పర్యటిస్తారు.

అకాలీల పరస్పరారోపణలు

తారాసింగ్, ఫతేసింగ్ వర్గాల పోటీ సభలు

ఆనందపూర్ సాహిబ్ (పంజాబ్) మార్చి11— సిక్కుల క్షేత్రమైన ఆనందపూర్ సాహిబ్‌లో జరిగిన హోలా మొహల్లా మేళా సందర్భంలో మాస్టర్ తారాసింగ్ సంత్ ఫతేసింగ్ వర్గాలు వేర్వేరుగా సభలు జరుపుకొని, ఒకరి విధానాలు నొకరు విమర్శించుకొన్నారు.

పంజాబీ సుభా నిర్మాణంలో స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా, మాస్టర్ తారాసింగ్ శిక్షాతికి ద్రోహం చేశాడని ఫతేసింగ్ వర్గం తారాసింగ్‌ను నిందించింది.

సంత్ ఫతేసింగ్ అకాలీదళ విచ్ఛిత్తికి కుట్ర పన్నాడని తారాసింగ్ వర్గం ఆరోపించింది.

పంజాబ్ ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్ కైరాన్ కాంగ్రెసు ఆధ్వర్యాన ఏర్పాటు చేయబడిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ చైనా సవాలును ఎదుర్కొనవలెనంటే ప్రజలు వర్గతత్వానికి, సంఘ విద్రోహ శక్తులకు అతీతంగా వ్యవహరించి కృషి చేయాలని ఉద్బోధించారు.

హైదరాబాద్ కార్పొరేషన్‌చే సర్దార్ మహల్ వేలం

నిజాం నవాబు తిరస్కృతి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 11—దాల్మియా సమీపంలోని "సర్దార్ మహల్" అనే భవనాన్ని ఇటీవల మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎజి 65 వేల రూపాయలకు వేలం వేయగా నిజాంనవాబు ఆ వేలంత్రోసివేశారు ఈ వేలాన్ని కార్పొరేషన్, కార్పొరేషన్ స్థాయీ సంఘువారు కూడా స్థిరపరచారు. వేలం షరతు ప్రకారం అది నిజాం నవాబు ఆమోదముద్ర పొందాలి.

ఇది పక్కా భవనమని, దీనిని ఎజి 65 వేల రూపాయలకు అమ్మడానికి వీలు లేదని దానికి రెండు లక్షల రూపాయలవరకు కిట్టుబాటవుతుందని నిజాం తన నిర్ణయాన్ని తెలియపరచారు.

విశేష ప్రచారం చేసి ఈ భవనాన్ని తిరిగి వేలం వేస్తారు.

బ్రహ్మ సమాజ కార్యక్రమాలు

హైదరాబాద్ సభలో శ్రీ కృష్ణశాస్త్రి వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 11— ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా బ్రహ్మ సమాజ కార్యక్రమాన్ని రూపొందించకపోతే, దానిని ఒక ప్రముఖ ఉద్యమంగా పునరుద్ధరించడం దుర్లభమని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నారు.

నిన్న ఇక్కడ బ్రహ్మ మందిరంలో ఆంధ్రప్రదేశ్ బ్రహ్మ సమాజం 81వ మహోత్సవాలకు శ్రీ కృష్ణశాస్త్రి అధ్యక్షత వహించారు.

క్రైస్తవ సిద్ధాంతాలైన సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా శ్రీ రాజా రామ మోహనరాయ్ ఆదిలో బ్రహ్మోపదేశ వ్యాప్తి చేసినప్పుడు అది కొద్దిమంది మేధావులు, విద్యావంతులకు బోధ పడిందని శ్రీ కృష్ణశాస్త్రి అన్నారు

విశ్వమానవతను గాంధీజీ ప్రజలలోకి గొనిపోయారని శ్రీ కృష్ణశాస్త్రి వివరించారు

రాజా రామమోహనరాయ్, గాంధీజీలను ఆదర్శంగా పెట్టుకొని నేటి బ్రహ్మ సమాజవాదులు తమ కార్యక్రమం రూపొందుకొనాలని శ్రీ కృష్ణశాస్త్రి అన్నారు.

తూర్పు పాకిస్తాన్‌లో గ్రామస్థులపై రైఫిల్స్ దళం కాల్పులు

ఇద్దరు మరణం మరొకరికి తీవ్రగాయాలు

ఢాకా, మార్చి 11—

తూర్పు పాకిస్తాన్ లోని నౌఖాళి జిల్లా గోసాయిపూర్ గ్రామంలో గ్రామస్థులపై రైఫిల్ దళంవారు కాల్పులు జరిపిన ఫలితంగా ఇద్దరువురు మరణించారని, మరొకరి పరిస్థితి ప్రమాదకరంగా వున్నదని నిన్న ఇక్కడకు అందిన వార్తలు తెలియచేస్తున్నాయి.

గ్రామస్థులు గడ్డితీసుకొని వస్తుండగా రైఫిల్స్ దళానికి చెందిన ఒక సైనికుడు అది ఇండియానుంచి తీసుకొని వస్తున్నదా అని ప్రశ్నించారట. అది తన సొంత పొలంలోనిదేనని ఆ గ్రామస్థుడు సమాధానమిచ్చాడట. అయితే దానితో రైఫిల్స్ దళం ఏకీభవించి దాన్ని స్వాధీనపరచుకొనడానికి యత్నించగా గ్రామస్థులు వారిపై దాడి చేశారట తర్వాత రైఫిల్స్ దళంవారు గ్రామస్థులపై కాల్పులు జరిపారట.

ఈ వార్తను ఢాకాలోని రైఫిల్స్ దళాధికారులు ధ్రువపరిచారని "పాకిస్తాన్ అబ్జర్వర్" పత్రిక పేర్కొన్నది.

క్యూబా వెడుతున్న రష్యన్ వాణిజ్య నౌకలు

అమెరికా విమానాలు పదరోధం కలిగించినట్టు వార్త

లండన్, మార్చి 11— గత కొద్ది రోజులుగా రష్యా వాణిజ్య నౌకలను అమెరికా విమానాలు, నౌకాదళానికి చెందిన నావలు ప్రయాణాన్ని ఆటంకపడుతూ చికాకు కలిగించినవని మాస్కో రేడియో ప్రకటన ద్వారా నిన్న ఇక్కడ తెలియవచ్చింది.

రష్యానుంచి, క్యూబా ప్రయాణం చేస్తున్న రష్యన్ నౌక అడ్మిరల్ నాజిమోవ్ గత నాలుగురోజులుగా అమెరికా విమానాలు 60 సార్లు చాలా ప్రమాదకరమైన పరిస్థితి గురి చేసినవని ఆ ప్రకటనలో తెలియజేశారు.

అమెరికన్ డిస్ట్రాయర్ నౌక దగ్లస్ హెచ్. ఫాక్, 60 గజాల దూరంనుంచి రష్యన్ నౌకను పాలోలు తీసినదని తెలిపారు.

క్యూబా ప్రయాణం చేస్తున్న మరొక రష్యన్ నౌక అర్కేంజల్‌నుకూడా అమెరికా విమానాలు, హెలికాప్టర్‌లు, డగ్లస్ హెచ్. ఫాక్ నౌకతో సహా చాలా ప్రమాద పరిస్థితి గురి చేసినవని ఆ రేడియో పేర్కొన్నది.

ఆయుధాల విధ్వంసానికి రష్యాతో మంతనాలు

సహేతుకం కాదని అమెరికన్ సెనెటర్ గోల్డు వాటర్ విమర్శ

ఇలినాయిస్, మార్చి 11—ఆయుధాలను విధ్వంసం చేయడానికి సెనెటు ప్రభుత్వం రష్యాతో చర్చలు జరుపుతున్నట్టు తనకు తెలిసిందని. ఈ చర్య ప్రస్తుతానికి సహేతుకమైనది కాదని రిపబ్లికన్ సెనెటర్ బారీగోల్డ్ వాటర్ మొన్న ఇక్కడ జరిగిన బహిరంగ సభలో హెచ్చరించారు.

అమెరికా విమాన బలాన్ని దెబ్బతీయాలని రష్యా చాలా కాలంగా ప్రయత్నాలు జరుపుతున్నదని, తమకు చెందిన 30 బి. 47 బాంబర్ విమానాలను, 30 రష్యన్ బాంబర్ విమానాలను విధ్వంసం చేసినంత మాత్రాన అన్ని రకాల మారణాయుధాలను మానవాళి ప్రయోజనాల నిమిత్తం ధ్వంసం చేసినట్టు కాగలదా? అని అడుగుతున్నారు.

రిపబ్లికన్ వర్గాలలో సెనెటర్ గోల్డ్ వాటర్ పలుకుబడి గలవ్యక్తిగా భావించబడ్డాడు.

సర్ జేమ్స్ ప్లిమ్‌సోల్ న్యూఢిల్లీ రాక

ఇండియాలో కొత్త ఆస్ట్రేలియన్ దౌత్యప్రతినిధి

న్యూఢిల్లీ, మార్చి 11— ఇండియాలో ఆస్ట్రేలియన్ హైకమిషనర్‌గా నియమించబడిన సర్ జేమ్స్ ప్లిమ్‌సోల్ నిన్న ఉదయం న్యూయార్క్ నుంచి ఇక్కడకు వచ్చారు

ఇండియా చీఫ్ ప్రొటోకోల్ శ్రీ ఎస్. కె. బెనర్జీ, తాత్కాలిక ఆస్ట్రేలియన్ దౌత్య ప్రతినిధి శ్రీ డబ్ల్యు. డి. బ్రిచెట్‌లు శ్రీ ప్లిమ్‌సోల్‌కు విమానాశ్రయంలో స్వాగతమిచ్చారు.

శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్

హైదరాబాద్, మార్చి 11— భవనాల శాఖ మంత్రి శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్ 13 వ తేదీన ఇక్కడ జరుగుదేరి నాగార్జున సాగర్ వెళ్ళి, నైట్రస్ ఉపార్యక్షుడికి స్వాగతం ఇస్తారు. రాత్రికి రాజధానికి తిరిగి వస్తారు.

రక్షణ నిధి సేకరణలో పంచాయతీల కృషి

—నల్లగొండ సభలో ముఖ్యమంత్రి ప్రశంస

హైదరాబాద్, మార్చి 11—

జాతీయ రక్షణ నిధికి ప్రజలు విరాళాలను యివ్వడంలో పంచాయతీరాజ్ సంస్థలు చేస్తున్న కృషికి ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి మొన్న నల్గొండలో జరిగిన ఒక బహిరంగ సభలో తన హర్షాన్ని ప్రకటించారు.

నల్గొండజిల్లా పోలీసు కేంద్రకార్యాలయం వద్ద రక్షణ నిధి సహాయార్థం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసిన సందర్భంలో జరిగిన ఈ బహిరంగసభలో వరంగల్ రేంజ్ డిప్యూటీ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ చిదంబరం పి. పాటిల్ టిక్కెట్లను అమ్మగా వచ్చిన 60 వేల రూపాయలకు ఒక చెక్కును ముఖ్య మంత్రికి సమర్పించారు.

శ్రీ సంజీవరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో రక్షణ నిధి వసూళ్ళు 3.5 కోట్ల రూపాయల లక్ష్యాన్ని మించినవని అన్నారు. నిధికి ఉదారంగా విరాళాలను యిచ్చినందుకు ఆయన రాష్ట్ర ప్రజలను అభినందించారు.

అంతకుముందు శ్రీ పాటిల్ మాట్లాడుతూ పోలీసు దళంలోని ప్రతి సభ్యుడు ఆత్యయిక పరిస్థితి ప్రారంభమైనప్పటినుంచి తన ఒక రోజు జీతాన్ని రక్షణ నిధికి సమర్పిస్తున్నాడని, వారు దీనిని కొనసాగించగలరని చెప్పారు.

సిరియా పరిస్థితి

(1 వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి వనితాలోకం

ప్రతి మంగళవారం ప్రచురణ

ప్రముఖ హిందీ రచయిత్రి:

శ్రీమతి మహాదేవి వర్మ

అభివ్యక్తీకరణా కాంక్ష మానవుల సహజ ప్రవృత్తి. వారు తమ హృద్గత భావాలు, హృదయంలోని ఆలోచన-విలోచనం, హర్ష-విషాదాలు, ఆశా-నిరాశలు, సుఖ-దుఃఖాలు జీవితపు వివిధ చిత్రాలను అభివ్యంజితంచేసి ప్రపంచ అనుగ్రహాన్ని అభిలషిస్తారు. మానవతా హృదయ కుహరాల్లో పరివ్యాప్తమై వున్న ఈ వ్యాకుల భావం నేటిదికాదు అది చిరంతనమైనది: అది ఒక సనాతన సత్యం.

ఆధునిక హిందీ సాహిత్యంలో కావ్య కళాశైలి అత్యధికంగా అభివృద్ధి చెందడమే గాక అది ఎంతో నవనవోన్మేషయై వికాసోన్ముఖంగా బాగా పురోగమించింది. దానిలో నూతనభావాభివ్యంజనం, కమనీయకల్పనలతో కూడిన మనోముగ్ధత, మహోన్నతస్థాయిలో కనుబడతాయి. ఒకవైపు ఈ ప్రపంచమనే అవనితపై ఇరువదవ శతాబ్దపు నేత్రాలను మైమరపించే విభిన్న చిత్రాలు అంకితమైనాయి. మరోవైపు మనోహరమైన ఆ చిత్రాలతోపాటు వైజ్ఞానిక భౌతిక సమస్యలు ఉపయోగితావాదివికాసం, లౌకిక జీవితవస్తువరాలకై విరామంలేని తాపత్రయం. మన జీవితపు గంతవ్యస్థాన సామీప్యాన పరిభ్రమిస్తున్నాయి. సాహితీరంగంలో కూడ గొప్ప విప్లవం చెలరేగింది. సత్యాన్మాన్యంగా పెద్దమార్పు వచ్చింది. వ్యక్తివాద మనేదిభావనం. దావిదృఢప్రాచీరాలునేలమట్టం కావడం ఆరంభమైంది. సమష్టిచేత నవజాగృతమై విలసిల్లింది. మహిళలలో నైతిక ప్రతి స్పర్ధా భావోత్సేవలం ఉరక లిడసాగింది. కవితా కన్యక సుమధుర రాగ విస్వనం వారి దృష్టిని ఆకర్షించింది. మహిళలు కేవలం భావ క్షేత్రంలోనే గాక కవితా కళా వజెనికి సంపూర్ణ సహకారాన్ని అందజేశారు. అట్టి సాహిత్యంలో—హిందీకావ్య కాశంలో మహోజ్వల తారిక శ్రీమతి మహాదేవివర్మ. ఆమె నెరుగనివారు హిందీ సాహిత్య జగత్తునందే గాక అన్య భాషా కోవిదులలో కూడా లేరు. ఆమె చింతన శీలి; విదగ్ధత పూర్ణమైన భావుక మహిళారత్నం. భావ కవితా జగత్తులో అన్య కళాకారులందరిలో అధికమైన అనుభూతి. ప్రభావోత్పాదకమైన అభివ్యంజనాశక్తి ఈమె రచనలో దృగ్గోచరమౌతాయి.

మహాదేవి 1907 లో ఫరూకాబాద్‌లో శ్రీమంత కుటుంబంలో జనసమందింది. తండ్రి పేరు శ్రీ గోవిందప్రసాదువర్మ, తల్లి శ్రీమతి హేమరాణిదేవి. వదకొండవ ఏటనే మహాదేవికి డాక్టర్ స్వరూపనారాయణ వర్మతో వివాహం జరిగింది. కాని ఈమె జీవితపు పంకుచిత అవరణలో బందీకాబాలక పోయింది. అనంతమైన ఆశాజ్యోతుల, మహత్తర అకాంక్ష - అభిలాషలు ఈమె జీవితంలో ప్రస్ఫుటితమైనాయి. వివాహ మనేదివరిమితమైనవరిధిలో పరిభ్రమింపడం ఎంతమాత్రం ఈమెకు పడ్డలేదు. మహోదాత్తమైన పాహితీసేవకై తన జీవితాన్ని అంకితంచేసింది. ప్రయాగలోనున్న ప్రొఫెసర్ గరల్స్ కాలేజీలో ఈమె అధ్యయనం ఆరంభించింది. సంస్కృతం, ఫిలాసఫీ తీసికొని ఎం.ఏ. పూర్తిచేసిన తరువాత సంస్కృతం తీసికొని ఎం. ఏ. పూర్తి చేసింది. ఈమె యస్. ఏ. చదువుచున్న రోజులలోనే ఈమె కవితకాంతులు 'బాండ్', 'మాధురి' అనే ప్రముఖ మాసపత్రికలో ప్రసరింపమొదలిడినాయి. ఎం. ఏ ఆయిన తరువాత ఈమె ప్రయాగ మహిళా విద్యాపీఠం-కాలేజీకి ప్రిన్సిపాల్‌గా నియమింపబడింది నేటివరకు ఆ పదవిలోనే ఈమె గౌరవప్రదంగా తన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈమె బాల్యంనుంచి అత్యంత సూక్ష్మబుద్ధి, గంభీరమైనమనః, పవృత్తికలిగిన మహిళ. ఈమె కృషివల్లనే సాహిత్యకార్-సంపద అనే సంస్థ స్థాపించబడింది. తద్వారా అనేకమంది రచయితలు, కవులకు సన్మానం. ఉచిత సేవా-పత్కారాలు జరుగుతున్నాయి. నిజమైన కళాకారులను ప్రభుత్వంకాని, ప్రజకాని త్వరగా గుర్తించలేదు. గుర్తించేరోజుకు ఆ కళాకారులు భువిమించి దివి కేగి యుండవచ్చు. అట్టిమహాకళాకారులు శ్రీమంతకుటుంబంలో జన్మించి యుండనిచో అజన్మమూ వ్యర్థదరిద్రులుగానే జీవితాన్ని వెళ్ళమార్చుతారు తమ కళకు కాంతులను దిద్దినోచుకోలేరు. అట్టి కళాకారులకు సమయానికి కాస్త అన్నంపెట్టి, ప్రాయదానికొక కలం, నీరా, కాగితాలు అందించి వారి కళకు జీవంపోసే సంస్థయే ఈసాహిత్యకార్-సంపత్. సామాజిక మౌఢ్యాల నెదిరించి, పరంపరాగత రూఢకవి కారీకుల్ని ప్రక్కకు నెట్టివందులకు ప్రతిఫలంగా మహాకవి 'నిరాలా' ఎన్నో కష్టాలకు గురియైనాడు. భార్య కడిపోయింది. కుమార్తె గతించింది సమాజం కోర్కె కూనింది. ఆ మహాకవి జీవితమంతా విరక్తి చెంది పిచ్చివానిలా వాడవాడలా తిరుగాడాడు. అట్టి మహాకళాకారుల దుస్థితి పట్ల మహాదేవి ఎంతగానో విలపించింది. సంపత్‌ను స్థాపించి నిరాలా మహాకవికి ఈమె ఆశ్రయం కల్పించింది. రవీంద్రుని కవితల్ని జ్ఞప్తికి తెచ్చే కవనప్రవాహం నిరాలా జీవిత జ్యోతి దేదీప్యమానంగా ఈ సంస్థలో వెలుగొంది భౌతికంగా గత సంవత్సరం అస్తమించింది. వాస్తవంగా కళాకారులపట్ల మహాదేవి పెన్నిధి లాంటిది.

కోమలత్వం, మాధుర్యం, వ్యథ మహాదేవి హృదయపు అమూల్య నిధులు. అంతర్వ్యథాప్త నిట్టూర్పులలో తనవ్యాకుల ప్రాణాల్ని దహించుటయందే ఈమెకు పరమ సుఖానుభూతి కలుగుతుంది. తద్వారా ఆమెకు ఒక విధమైన మహోజ్వల ఆనందం నిచ్చిస్తుంది. వేదన ఆమెకు చిరంతనమైన సఖి - అది లేకుండా ఆమె బ్రతుకజాలదు. తన ప్రియతముడైన ఈశ్వరుణ్ణి వేదనలో అన్వేషిస్తుంది. పరబ్రహ్మ స్వరూపుడైన ప్రియుడు (ఈశ్వరుడు) కనబడినచో ఆయన యందు వేదనను వెదకాలనుకుంటుంది.

"నిహార్" 'రశ్మి' రెండు కావ్యాలలో ఈమె నిరాశ, నిస్పృహలతో అభిభూతమై హృదయపు దయార్ద్ర రూపం గోచరిస్తుంది. "దీపశిఖ" కావ్యంలో ప్రణయ సంక్షోభితం దృష్టిగత మవుతుంది. ఈమె హృదయం ఎల్లవేళలా అభావానుభవంతో నిండి యుంటుంది. ఆ భావాన్వేషణలో ఈమె అత్యంత వ్యాకులచిత్తురాలు. ప్రథమ సమాగమానంతరమే ఆ అజ్ఞాత ప్రియునితో వియోగం ఏర్పడింది. ఈమె తన ప్రాణ ప్రియుణ్ణి కంఠార్థం దర్శించుకోలేక పోయాను. అంటుంది.

"ఇస్ లలభాయీ పలకోంపర్ పహరా జబ్ ధా లీఢత, సామ్రాజ్య ముయేపే డాలా ఉస్ చితవన్‌పే పీడాకా!"

(ప్రియతముడు కవయిత్రి ఎదుట వచ్చి సాక్షాత్కరించినపుడు ఆశాప్రపూరితమైన కనురెప్పలపై నిగ్గు పహరా ఇస్తూ వుంది. అందుచే కనురెప్పలు పైకెత్తి నా ప్రియతముణ్ణి కండ్లారా చూడలేకపోయాను. అయినా, ఆయన చరణ సౌందర్యసందర్శనం నన్ను వేదనా సామ్రాజ్యానికి పట్టమహిషిగా చేసింది. అని పై పద్యభాగానికి భావార్థం.)

మహాదేవి ముఖ్యంగా అంతర్ ప్రవృత్తి విరూపకమైన కవయిత్రి. ఆమెతనలోతనను, భౌతిక జగత్తును దర్శించుకొంటుంది. అంతే కాదు. ఆమె అండ బ్రహ్మాండ పిపీలికాది



గలేబులకు డిజైను

పర్యంతం వ్యాప్తమై, అనంతమైన ప్రకృతి సౌందర్యశ్రీలో భాసితమయ్యే నిరాకార స్వరూపుడైన ఈశ్వరోపాసకురాలు. ప్రియతముని రూపం ఈమె కండ్ల ఎదుట ఎల్లవేళలా నాట్యంచేస్తూవుంటుంది. ఆయన మధురస్వరం ఈమె వీనులకు సదావినిపిస్తూ వుంటుంది.

ఈమె రచించిన "మూకటలన్", "మూక ప్రణయం" అనే కవితల్లో పరమాత్మ - భావుక హృదయంలో ఉద్భవించే అనుభూతి తరంగాల చిత్రణ హృద్యంగా మంగా చేయబడింది. సాధారణ వస్తువులో దాగిన అందాన్ని - అనందాన్ని తాను అనుభూతి పొంది ఇతరులకు ఆ అందానందాన్ని తన కవిత్వాలలో అందిస్తుంది. మబ్బులలో పిట్టలలో, పువ్వులలో, అడవులలో, వాగులలో, రమ్య లోకంలో మెరిసే రమణీయతలోకాన్ని సృష్టించే కవితా కళా నైపుణ్యం ఈమె లేఖినిలో వుంది. ఈమె తన భావ కవితా జలధిలో ప్రవేశించి అధ్యాత్మికతలో పరమానంద భరితురాలయి వ్రాసిన కవితల్లో వ్యాకుల ప్రణయవేదన, దివ్యమూ-అలౌకిక చిన్మయాశక్తి, స్థూల సౌందర్యంపట్ల మానసిక ఆకర్షణ, మొదలయిన అనేక వజీవ చిత్రాలు గోచరిస్తాయి. వాటిల్లో కవయిత్రి విలక్షణ భావభంగిమలు దృగ్గోచరమౌతాయి. జీవితపు గంభీర దార్శనిక తత్త్వాలు అంతర్నిహితాలై ఈమె కవిత్వాల్లో మనకు గోచరిస్తాయి.

"ముఝే న జానా అపనీ ఉస్‌నే
జానా ఇస్ అంధోంకా పానీ.
మైనే దేఖా ఉసే నహ
పదధ్వని ఉస్ కీ నహదానీ;
మేరే జీవన్ మేం ఉస్‌కే స్మృతి
భీతో విస్మృతబన్ అతీ
ఉస్ కే విర్జన మందిర్ మేం
కాయాభీ ఛాయాహో జాతీ;
క్యోం యహ నిర్మమ్ ఖేల్ సజనీ!
ఉస్‌నే ముఝుసే ఖేలా హై!"

(అర్థం : సఖీ! ఆయన (ప్రియతముడు) నన్ను అర్థం చేసుకోలేదు. విరహ వేదనతో తపన చెందుతూ నేను కార్చే కన్నీళ్ళను ఆయన గుర్తించాడు.-అంతే. ఆయన్ని సజీవంగా స్పష్టంగా ఎన్నడూ చూడలేదు. కాని ఆయన పదధ్వనిని నేను తక్కగా గుర్తించాను. నా జీవితంలో ఆయన స్మృతి నానాటికీ విస్మృతిగా పరిణమిల్లుతుంది ఆయన విర్జన మందిరంలో ఈ దేహం ఛాయగా మారిపోతుంది. సఖీ! ఆయన నాతో ఇంతటి నిర్దాక్షిణ్యంగా ఎందుకు వ్యవహరించాడు.)

ఎంతటి మహిమాన్విత పంక్తులివి! సత్యాన్వేషణలో వ్యాకుల ప్రాణాలు పలువైపులా వున్న అనంత దుఃఖాలను చూసి సంక్షోభితయైఆమెకంపితహృదయం జ్యోతిర్మయమై ఆహర్నిశలు వెలుగుతూ వుంది. ప్రకృతి ఒడిలో ఆమెబొత్సుక్యం జాగ్రత్తమైనప్పుడు గగనపథంలో వికీర్ణమై యున్న అసంఖ్యాక ములైన ముత్యాలు ఆమెను తమవైపుకు ఆకర్షించుకోవడంలో అసమర్థత మౌతాయి. ఆమె ఆ నక్షత్రమాలికల సోయగాన్ని మరచి పోతుంది:—

"ఆలోక్ యహాం లుటతా హై,
బఖ్ జాతీహైం తారాగణ్
ఆవిరామ జలకరితా హైం,
వర్ మోరా దీపక్ సామన్."

ఈమె హృదయ దీపికాజ్యోతి సమజెన, అనంత నక్షత్రాలోకం ఎందుకూ కొరగకుండా పోతుంది. మహాదేవి అంతర్చేదినీ దృష్టి అతితీక్షణమూ, సూక్ష్మమూ, నైపుణి. ఈమె హృద్గత భావాలు రానురాను అతి సూక్ష్మమై పోయాయి, జీవితం ఎప్పుడు సమంగావుండదు. వైషమ్యాలతో అదీ ముసిగి తేలుతూ వుంటుంది. అందుచే ఈమె భగవంతుణ్ణి ఇలా ప్రార్థిస్తుంది. ఈమె జీవితంలో శాశ్వతంగా అసంతృప్తివుండితీరాలి. ఎందుకనగా దుఃఖంలోనే సుఖం అంతర్నిహితమైవుంది. నిరాశలో మండియే ఆశాకిరణాలు ఉదయిస్తూ వుంటాయి.

"మేరే ఛోటే జీవన్ మేం
దేనా న తృప్తికా కణభర్
రహనే దో ప్యాసీ అంఖేం
భరతీ అంసూ కే సాగర్"

మహాదేవి విషాదంలోనే హర్షం, తాపంలోనే శీతలం, బాధలోనే ఆత్మానందాన్ని అనుభవిస్తుంది.

"ఏక్ కరుణ అభావ్ మేం
చిర తృప్తి కా సంసార్ సంచిత్
ఏక్ లఘు క్షణ దే రహా
నిర్మాణ్ కే వరదాన్ శత శత్
షాంతియా మైంనే కిసే,
ఇస్ వేదనా కే మధుర క్రమమేం
కౌన్ తుమ్ మేరే హృదయ మేం?"

శ్రీమతి మహాదేవి "నీరజా" "సాంధ్యగీత్" అను కావ్యాలను కూడ రచించింది కవయిత్రి ప్రారంభిక రచనల్లో వేదనా వేదనలు, బాధ అధికంగా గోచరిస్తాయి ఈ రెండు కావ్యాల్లో సుఖ-దుఃఖాలు సమానంగా అభివ్యంజితమైనాయి. ఈమె గీతి కావ్యాల్లో మాధుర్య సంగీతాల అపూర్వ సమన్వయం కనబడుతుంది. ఈమె కోమల భావాలు అతివాస్తవికవాదంలో చిక్కుకోలేదు. అందుచే ఈమె కవిత్వాలు వాస్తవిక విషయాలకు దూరంగా వుంటాయి. ఎంతో కాలంగా గోచరించే అతి యదార్థత, వైజ్ఞానిక భౌతిక వాదం, నీరస కృత్రిమ సౌందర్యాలనుచూసి ఈమె వాటికి నానాట దూరమై అచే పరిమాణంలో ఈమె కవిత్వం అంతర్ముఖమై సాగింది. భౌతికం నుండి అభౌతికం వైపు అధికంగా ఈమె రచన పురోగమించింది. అనుభూతి, కల్పనలకూ అనుకూల సామంజస్యం ఉన్నప్పటికీ - అవి సత్యాన్వేషణకు ఆలంబన తత్త్వములై నప్పటికి ఈమె తన దార్శనిక విలువలకు సాంఘిక యదార్థములనెది సంపర్కణాప్పర్పు నుంచి అన్యపృక్కయాగానే ఉంచింది. ఈమె భావ తన్మయత, కాల్పనిక రమ్యత, సూక్ష్మ భావజన్య మాదకత్వం ఎంతో తీవ్రమైనట్టివి-అందువల్లనే ఈమె చింతన సాకారమై ప్రణయ కవిత్వాలలో రూపొందింది. ఆమె ఇలా అంటుంది :

"మధుర మధుర మేరే దీపక్ జల్,
యుగయుగ ప్రతిదిన్ ప్రతిక్షణ ప్రతిపల్
ప్రియతమకా పథ్ ఆలోకిత్‌కర్.!"

["ఓ మధుర మూర్తియైన నా హృదయ దీపికా, నీవు వెలుగుతూ సర్వకాల సర్వావస్థలయందు - యుగ యుగాలతరబడి ప్రియతముని ఆగమనపథాన్ని ఆలోకిత మొనర్చు" అని భావ].

శ్రీమతి మహాదేవి వర్మ కొన్ని గద్య రచనలుకూడ రచించింది. వాటిలో "శృంఖలాకే కడియాం" "అతీత్ కే చలచిత్రా" అనునవి ముఖ్యమైనవి. గద్యరచనల్లో ఈమె చెడులో దాగిన మంచికోసం, పాపపంకంలో నికసించే పంకజాలకోసం తరచిచూచింది. ఈమె కావ్య కళాఖండికలు సాహిత్య నిధానికి ఆణిముత్యాలు.



దిండు గలేబులకు డిజైను

—శ్రీ ఎమ్. కోటేశ్వరరావు, లక్కవరం.

స్వర్ణకారుల క్లిష్టస్థితి: మహిళల బాధ్యత

సువర్ణం చిరకాలంనుంచి అమూల్యమైనదిగా పరిగణింప బడుతూవచ్చింది. తమ సువిశిత మేధస్సును ఉపయోగించి బంగారంతో వివిధరకాల అభరణాలను తయారుచేయడం ద్వారా స్వర్ణ శిల్పులు మహిళల అందచందాలను ఇనుమడింప చేయడానికి కారణభూతులుగా వుంటూ వచ్చారు.

పూర్వం రాజులు, చక్రవర్తులు, జమీందారులు లలిత కళలను పోషించినప్పటి ఒక

బలభద్ర
నగరాజకుమారి

విధంగా మహిళలు చిరకాలంగా స్వర్ణ శిల్పులను పోషిస్తున్నారని చెప్పవచ్చు.

కాని నేడు దురదృష్టవశాత్తు చైనాదేశం సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఇండియాపై దాడి చేసింది. బలీయమైన చైనాను ఎదుర్కొనడానికి మనకు విశేషంగా ఆధునిక ఆయుధాలు అవసరమైనవి. ఈ ఆయుధాలను దేశంలో ఉత్పత్తి చేయడానికి తగిన అవకాశాలు యింకా మనకు ఏర్పడలేదు విదేశాలనుంచి వాటిని దిగుమతి చేసుకొనవలసివున్నది. విదేశాలనుంచి యివికావాలంటే మన రూపాయలతో కొనుగోలు చేయడం సాధ్యంకాదు. అందుకు బంగారం కావాలి. ఈ కారణంవల్ల ప్రభుత్వం బంగారంపై నిషేధాన్ని విధించింది.

దాని ప్రకారం యిక 14 క్యారెట్లకు మించిన వన్నెగల బంగారంతో వస్తువులు చేయించుకునే అవకాశం లేదు. పోతే యిలా 14 క్యారట్ల బంగారంతో వస్తువులు చేయించుకొనడానికి మహిళలుగాని, వ్యాపారస్తులుగాని ముందుకు రావడంలేదు. ఇంతేగాక 14 క్యారట్ల బంగారంతో వస్తువులు చేసే అలవాటు కూడా స్వర్ణకారులకులేదు.

స్త్రీలకు అధరణాలపై మోజు తగ్గించి తద్వారా బంగారం దేశ శ్రేయస్సుకు వినియోగ మయ్యేటట్టు చేయాలన్న విశాల దృక్పథంతోనే ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది.

అయితే దీనివల్ల స్వర్ణకారులకు తమ వృత్తిని కోల్పోవలసివచ్చింది. ఇది అత్యంత విచారకరమైన విషయం. ప్రస్తుతం స్వర్ణకారులు ఎంతో దుర్భరంగా జీవితాలను వెళ్ళబుచ్చుతున్నారు. కుటుంబపోషణ వారికి కష్టతరమై పోయింది. ఈ క్లిష్టస్థితికి తట్టుకొనలేక యిటీవల కొందరు స్వర్ణకారులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు కూడా పత్రికలలో చూశాము.

ఈ స్థితిని యిలా కొనసాగిస్తే ముందు ముందు స్వర్ణకారులకు యింకా ఎలాటి విపత్కర పరిస్థితులు ఏర్పడగలవో వూహించడం కష్టం. కనుక అటు ప్రభుత్వము, యిటు సమాజమూ కూడా వారి దైన్యాన్ని పోగొట్టడానికి తమశక్తికొలదీ యత్నించడం అవసరం.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీరి సమస్యకు అధిక ప్రాధాన్యమిచ్చి ఏ ఏ వృత్తి, ఉద్యోగాలకు వీరు పనికివస్తే ఆ యా ఉద్యోగాలలో వారిని నియమించాలి. అవసరమైతే కొద్దిపాటి శిక్షణతో పరిపోయే వృత్తులలో వీరికి ప్రవేశం మిచ్చింది తగు శిక్షణాపథకాలు కల్పించాలి శిక్షణ సమయంలో వారికి కొంత ఉపకార వేతనం యివ్వడం సముచితం.

పోతే సమాజం బాధ్యత. సమాజంలో ముఖ్యంగా స్త్రీలు స్వర్ణకారుల పట్ల సానుభూతిని ప్రదర్శింప వలసిన సమయమిది.

నేడు యించు మించు అన్ని గ్రామాలలోను మహిళా సమాజాలున్నవి. ఆ సమాజాలవారు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని ఆ ప్రాంతాలలోని స్వర్ణకారుల సంక్షేమం నిమిత్తం కొంత నిధిని పనూలు చేసి వారికి తోడ్పడడం సముచితం కాగలదు. అలాగే పట్టణాలలోని మహిళా సంఘాలువారు కూడా శ్రద్ధ వహించాలి.

దీనివల్ల శాశ్వతంగా వారి సమస్యకు పరిష్కార మార్గం లభించదు. కాని ప్రభుత్వం ఏదో ఒక సర్దలయానికి వచ్చి వారికి తగు ఏర్పాట్లు చేసేవరకు ఈ సహాయాన్ని అందజేయడం అవసరం.

దేశ స్వాతంత్ర్య పరిరక్షణ కర్తవ్యం నేడు స్వర్ణకారుల చేతుల్తులను త్యాగం చేయించింది. స్వర్ణకారులు చిరకాలంగా తమ అందచందలకు మెరుగుపడిద్దే అభరణాలను తయారు చేస్తూ వచ్చారన్న విషయంతోపాటు ఈ అంశాన్నికూడా దృష్టిలో పెట్టుకుంటే ప్రతి మహిళా యీ కర్తవ్య నిర్వహణకు పూనుకొనగలదనడం నిస్సందేహం.

మూలలకు డిజైన్

డి. పార్వతీశం, బిక్కవోలు

సోవియట్ సమాజంలో మహిళల స్థానం

"స్త్రీల సమస్య"కు సుదీర్ఘమైన చరిత్ర వుంది. అనేక శతాబ్దాలపాటు సమాజం ప్రజలందరికీ పూర్తి స్వేచ్ఛా సౌభాగ్యాలను సమకూర్చలేకపోయింది. స్త్రీలు అత్యధికంగా పీడింపబడ్డారు. వారెన్నో కష్టాలనుభవించారు.

దోపిడీ అనేది పూర్తిగా నిర్మూలించబడిన సామ్యవాద వ్యవస్థలో మాత్రమే స్త్రీకి సమాన ప్రతిపత్తి లభించింది.

చేసిన పనికి సమానమైన వేతన మివ్వడమూ, ఉన్నత విద్యాభ్యాసానికి హక్కు యివ్వడమూ అంత కష్టం కాదు, కాని స్త్రీ యిటి పనులూ, శిశుసోషణ చేసుకుంటూ పనిచేయడానికే కాక, ప్రభుత్వ వ్యవహారాలలోను, రాజకీయాలలోనూ చురుగ్గా పాల్గొనగలగడానికి కూడా తగు పరిస్థితులను సృష్టించడం చాలా కష్టం. సోవియెట్ దేశంలో అటువంటి పరిస్థితులు సృష్టించబడ్డాయి.

సోవియట్ జాతీయార్థిక రంగంలో 4 కోట్ల 70 లక్షల మంది స్త్రీలు పనిచేస్తున్నారు 300,000 మందికి పైగా స్త్రీలు డాక్టర్లుగానూ, 1,400,000 మంది ఉపాధ్యాయులుగానూ, 150,000 మంది విజ్ఞాన రంగంలోనూ పని చేస్తున్నారు. మొత్తం డాక్టర్ల సంఖ్యలో మహిళలు 75 శాతమూ మొత్తం ఉపాధ్యాయులలో 70 శాతమూ, వున్నారు.

సోవియట్ ఇంజనీర్లలో, మూడవ వంతు మంది స్త్రీలే. వారికి పురుషులతో సమానమైన పనికి సమానమైన వేతనం లభిస్తున్నది.

స్త్రీలపని తేలికయింది. జీవిత పరిస్థితులు బాగున్నాయి. ఇటీవల కట్టాల ననుసరించి,

రచన
ఓల్గాతుగనోవా

స్త్రీలు భూగర్భంలోనూ, గనులలోనూ, చేపలు పట్టే పడవలలోనూ, పనిచేయడానికి వీలులేదు పరిశ్రమలలోనూ వ్యవసాయములోనూ యాంత్రికీకరణ, స్వయం చలనీకరణవల్ల శరీరకష్టం క్రమంగా తొలగిపోతూంది.

ఎక్కువగా పౌర భోజనశాలలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయడంద్వారానూ, ఇంటిలో వాడుకునే యంత్రాలను ఎక్కువగా సప్లయి చేయడం ద్వారానూ స్త్రీలకు యింటిపని బాగా తగ్గించబడింది.

సోవియట్ సమాజంలో మాతలకు చాల సహాయం జరుగుతూంది. పని చేస్తున్న స్త్రీలకు నాలుగు మాసాలు జీతంతోబాటు ప్రసూతి సెలవు యివ్వబడుతుంది. పాలిచ్చే తల్లులకు జీతం తగ్గించకుండా పని గంటలు తగ్గించబడతాయి. ఇద్దరు పిల్లలుండి, మూడవ బిడ్డను కన్న తల్లికి ప్రభుత్వ ధన సహాయం లభిస్తుంది; ముగ్గురు బిడ్డలుండి నాల్గవ బిడ్డను కన్న తల్లికి ప్రభుత్వం ప్రతినెలా గ్రాంట్ యిస్తుంది.

శిశు పోషణాలయాలూ, బోర్డింగు పాఠశాలలూ ఎక్కువవుతున్నాయి. ఈ నాడు దాదాపు 5,500,000 మంది బాలలు శిశు పోషణాలయాలకూ, కిండర్ గార్డెన్‌లకూ వెడుతున్నారు. ఇంకా ఎక్కువగా సోవియట్ స్త్రీలు ఉద్యోగాలు చేయాలనీ, పౌర కార్యకలాపాలలో పాల్గొనాలనీ వాంఛిస్తున్నారు కాబట్టి తమ పిల్లలను బాలల సంస్థలలో పెట్టదలచుకొంటున్నారు, కాబట్టి ఈ సంస్థల సంఖ్య యింకా ఎక్కువ కావలసి వుంది.

దారిద్ర్యమనేది పూర్తిగా నిర్మూలింపబడి, మానవుని సృజనాత్మక శక్తి సామర్థ్యాలు పూర్తిగా వికసింపగల స్వేచ్ఛ సమానత్వం న్యాయంతో కూడిన సమాజాన్ని నిర్మింపడమనే భావాలు సామ్యవాద సమాజంలో స్త్రీలను ఉత్తేజపరుస్తున్నాయి. స్త్రీలు ప్రభుత్వ, రాజకీయ రంగాలలో పనిచేయడలచుకోడానికిదే ముఖ్య కారణం. సోవియట్ పార్లమెంట్‌లో 390 మంది స్త్రీలు సభ్యులుగా వున్నారు. రిపబ్లిక్కుల సుప్రీం సోవియెట్లలోనూ, స్థానిక సోవియట్లలోనూ గల సభ్యులలో 41 శాతం మహిళలే.

సోవియట్ దేశంలో ఇటీవలి సంవత్సరాలలో పౌర సంస్థలకు అధికారం బాగా ఎక్కువ చేయబడింది. ఉత్పత్తిపై ఆజమాయిషీ, పని పరిస్థితులను బాగుచెయ్యడం, విద్యా, సాంస్కృతిక రంగాలలోకృషి, తదితర విషయాలు ప్రజాసంస్థలకు అప్పగింపబడ్డాయి. స్త్రీలు యీ సంస్థలలో నానాటికీ ఎక్కువగా పాల్గొంటున్నారు.

ఇప్పుడు రేడియో విక్టర్‌ఘాళి. అలుయుద్ధ ప్రమాదము మూసగ జాతిని ఎదుర్కొంటున్నది. అందువల్ల అపోపలక్షల మంది స్త్రీలు శాంతికోసం పోరాడుతున్నారు. పిల్లల్ని పెంచడమూ, రోగులకు సేవ చెయ్యడమూ స్త్రీలకెంత సహజమో, అలాగే వర్తమాన, భావి సంతతులను కాపాడడానికి కృషిచెయ్యడం కూడా అంత సహజమే. శాంతికోసమై సోవియెట్ దేశం చేసిన ప్రతిపాదనలన్నీ మహిళల కృషిని, దీక్షనూ కూడా ప్రతిబింబిస్తున్నాయి.

భవిష్యత్తులో సోవియెట్ సమాజంలో స్త్రీల పాత్ర మరింత గురుతర మవుతుందనడం నిస్సందేహం. ఇంటి పనులు బాగా తగ్గిపోతాయి. పనిగంటలు యింకా తగ్గి శాంతి ఎక్కువవుతుంది. పౌర సంస్థల పరిపాలన అభివృద్ధి అవుతుంది. కాబట్టి స్త్రీ సాంస్కృతిక, వినోద కార్య కలాపాలు బాగా ఎక్కువవుతాయి.

యుద్ధ ప్రమాదం పూర్తిగా తొలగించబడి అంతర్జాతీయ స్నేహ సంబంధాలు నెలకొల్పబడినట్టయితే, సమస్త మానవజాతి సౌభాగ్యానికి, ప్రగతికి అంతర్జాతీయ రంగంలో మరింత విస్తృత సహకారం నెరపడానికై మహిళలకు అవకాశం లభిస్తుంది.

వర్గీకృత ప్రకటనలు

వేలం నోటీసు

తుని మునిసిపల్ కమిషనరుగారిచే ది॥ 15-3-63 ఉదయం 9 గంటలకు పాత స్లాటరు హౌస్ బిల్డింగు నెలసరి లీజు ఇచ్చుటకు బహిరంగముగా మునిసిపల్ ఆఫీసులో వేలము వేయబడును. అన్ని పాటలకు వర్తించు షరతులు ఈ పాటలకు వర్తించును. ఇతర విషయములు ఆఫీసు పని చేయు వేళలందు పొందవచ్చును.

యస్. జె సుందరరావు,
కమిషనర్ మరియు స్పెషలాఫీసర్.

ప్రకటన

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

మచిలీపట్టణం — డివిజినల్ ఆఫీసు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియావారిచే శ్రీ పి. యస్. రాజు, (ఆర్. ఏ. ఎస్. ఎమ్. దక్షిణ రైల్వే, తుని) జీవితంపై జారీ చేసిన నెం. 10303828 పాలసీ పట్టా పోయినదని నోటీసు యివ్వబడినది ఈ తేదీనుంచి నెల రోజుల లోపు అభ్యంతరం తెలియజేయనిచక్షంలో డూప్లికేటు పట్టా జారీ చేయబడును.

(సం.) పి. యస్. సుందరం.
డివిజినల్ మేనేజరు.

టెండరు నోటీసు

పెడన పంచాయతీ, కృష్ణా జిల్లా

1963-64 సం॥కు కావలసిన యీక్రింద వాటిని సప్లయి చేయుటకు సీలు చేయబడిన టెండర్లు పెడన పంచాయతీ ఆఫీసులో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గారిచే ఆఫీసు పనిచేయు వేళలయందు 19-3-63 తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలవరకు తీసుకోబడి ఆ దినమే హాజరైన టెండరుదార్ల సమక్షములో సాయంత్రం 4-30 గంటలకు టెండర్లు పరిశీలన నిమిత్తము తెరవబడును. టెండర్లు పంపుకోగోరువారు నిర్ణీత టెండరు డిపాజిట్టు చెల్లించి రశీదు టెండరు దరఖాస్తుకు జతపరచి పంపుకోవలెను.

		టెండరు ధరావతు
1.	స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుటకు,	రూ. 50
2.	లైటింగ్ సామాన్లు సప్లయి చేయుటకు.	రూ. 50
3.	కాస్సర్వెన్సీ సామాన్లు సప్లయి చేయుటకు.	రూ. 20
4.	రబ్బిషు బండ్లకు 4 ఎద్దులను సప్లయి చేయుటకు,	రూ. 50
5.	కిరోసిన్ సప్లయి చేయుటకు.	రూ. 50

టెండరు నిబంధనలు తదితర వివరములు ఆఫీసుకు వ్రాసి తెలుసుకోవచ్చును.

పెడన, (సం) జి. వి. రామచంద్రరావు,
19-3-63. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

సవరణ

ది॥ 10-3-63 న ప్రచురించబడిన ఆంధ్రప్రదేశ్ అయిరన్ అండ్ స్టీలు మర్చంట్సు ఆసోసియేషన్ వారి ప్రకటనలో 5 వ లైనులో "రాకిల్ కమిటి"కి బదులుగా "రాజ్ కమిటి" అని సవరించుకొనవలెను.

గృహవైద్యం:

శిశువ్యాధులు-8

తల్లిరచుగా శిశువులు పాల్పడే వ్యాధి కోరింత దగ్గు, దీనిని హూపింగ్ కాఫ్ అంటారు ఇది సామాన్యంగా రెండు మొదలు ఐదు సంవత్సరముల వయస్సుగల చిన్న పిల్లలకు వస్తుంది. చిన్న పిల్లలకు పట్టే ప్రమాదకరమైన వ్యాధులలో ఇది ఒకటని చెప్పవచ్చు. అలా అని పెద్దవారికి రాదని చెప్ప వీలులేదు.

దీని లక్షణాలు తెరలు తెరలుగా దగ్గు రావడం, కూతలందు 'శరస్సునందు' కడుపునందు ఇరు ప్రక్కలందు నొప్పిగా వుంటుంది. ముఖము చూడడానికి కృశించి తండీనత్వంగా వుంటుంది. శరీర బలం కంఠ స్వరం క్షీణిస్తాయి దగ్గు తరువాత క

సాంకేతిక, పరిపాలన సామర్థ్యం పెంపుదల

ఉత్పత్తి రంగాలలో సత్ఫలితాల సాధనకు అవసరమని ఢిల్లీ గోష్ఠి భావన

అధిక లాభాలపై పన్నువల్ల పారిశ్రామిక విస్తరణకు విఘాతం కలుగవచ్చునని పలువురి ప్రముఖుల అభిప్రాయం

న్యూఢిల్లీ, మార్చి 10—

దేశ ఆర్థిక వ్యవస్థలోని వివిధ ఉత్పత్తి రంగాలలో ఇంకవరకు జరిగిన పెట్టుబడుల విషయంలో సత్ఫలితాలు సిద్ధించడానికి వీలుగా సాంకేతిక, పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి తీవ్రకృషి చేయాలని జాతీయ ఆర్థిక విషయాల పరిశోధనా సమితి నిన్న ఢిల్లీలో ఏర్పాటు చేసిన గోష్ఠి అభిప్రాయపడింది.

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్న ఈ గోష్ఠికి శ్రీ వి. టి. కృష్ణమాచారి అధ్యక్షత వహించారు.

1963-64 బడ్జెట్టు సాహసోపేత మైనదని గోష్ఠిలో పాల్గొన్న కొందరు వ్యక్తులు అభివర్ణించారు.

లాభాలపై సూపర్ ట్యాక్స్ వల్ల పారిశ్రామికాభివృద్ధికి విఘాతం కలుగవచ్చుననే భయాన్ని కొంత మంది వ్యక్తం చేశారు.

శ్రీ వి. టి. కృష్ణమాచారి మాట్లాడుతూ, అత్యయిక పరిస్థితివల్ల జాతి అంతా ఇదివరకు ఎన్నడూ ఎరుగనంతగా ఏకమైనదని, అంతే కాకుండా దేశ రక్షణ వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన త్యాగం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా వున్నారని అన్నారు. ప్రజలలోని ఈ ఉత్సాహాన్ని సద్వినియోగం చేసికొనాలని ఆయన చెప్పారు.

తీవ్ర కృషి జరిపినట్లయితే వ్యవసాయోత్పత్తిలో నాలుగింట మూడు పాళ్ళు అభివృద్ధిని సాధించ వచ్చునని, అవసరమైన పంటకాలవలను త్రవ్వించి అదనంగా 50 లేక 60 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యాలను కల్పించవచ్చునని ఆయన సూచించారు.

దేశ రక్షణ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను నెరవేర్చడానికి వీలుగా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల రేటు సాలీనా నూటికి ఏడు వంతులవరకు వుండాలని ఆయన చెప్పారు.

ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. డి. దేశ్‌ముఖ్ ప్రసంగిస్తూ, పరిపాలనా సామర్థ్యం తగ్గిపోకుండా సత్వరమే తగు చర్యలను తీసికొనాలని చెప్పారు.

జననవార పరిశ్రమకు చెందిన బ్రిటిష్ సంస్థ ప్రతినిధి సర్ జాన్ బ్రౌన్ మాట్లాడుతూ అధిక లాభాలమీద పన్ను వేయడం వల్ల ముఖ్యంగా జననవార, బొగ్గు పరిశ్రమల విస్తరణకు విఘాతం కలుగుతుందని, దానితో ఇండియా ఆర్థికాభివృద్ధికి, విదేశీ మారక ద్రవ్యం ఆర్జనకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు.

రిజర్వుబ్యాంకి మాజీ గవర్నర్ శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగార్ మాట్లాడుతూ కొత్త బడ్జెట్టు సాహసోపేతమైనదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వున్నదని చెప్పారు. అధికలాభాలపై పన్నువల్ల ఆయనకూడా భయ సందేహాలను వెలిబుచ్చారు. నేడు దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితి దృష్ట్యా మూడవ ప్రణాళిలోని పథకాల విషయమై పునఃపరిశీలన జరిపి, ఇప్పుడు అవసరమైనవాటికి హెచ్చు ప్రాముఖ్యాన్ని యివ్వాలని ఆయన సూచించారు.

ప్లానింగ్ కమిషన్ పథకాల పునఃపరిశీలన ఎప్పుడో జరిగినదని, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, వ్యవసాయం, రవాణా, ఇవి జాల ఉత్పత్తి పథకాలకు హెచ్చు ప్రాముఖ్యాన్ని యిచ్చామని ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ సి. ఎం. త్రివేది తెలియజేశారు.

ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు శ్రీ ఫాస్టర్ ప్రసంగిస్తూ అధిక లాభాలపై పన్ను, పరిశ్రమల విస్తరణకు అటంకమే కాకుండా విదేశీ పెట్టుబడులను నిరోధించగలదని చెప్పారు.

ఈ చర్య తాత్కాలికమేనని ప్రభుత్వం స్పష్టం చేసినట్లయితే కొంతమేలు చేకూరగలదని ఆయన చెప్పారు.

ఆర్థికాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ వి. కె. ఆర్. వి రావు మాట్లాడుతూ పన్నుల పరిశీలన సంఘం సూచించినట్టు వ్యయసరిశీలన సంఘాన్ని ఒక దానిని నియమించాలని చెప్పారు.

కొత్త బడ్జెట్టును ఆయన ప్రశంసిస్తూ, అనవసరమైన వస్తువుల వినియోగాన్ని తగ్గించే దృష్టితో ఇది రూపొందించబడినదని అన్నారు.

అధిక లాభాలపై పన్నును విధించడం వల్ల అన్ని వర్గాల ప్రజలపై పన్నుల భారం సమంగా పడినదన్న అభిప్రాయం అల్పాదాయ వర్గాలకు కలుగుతుందని, అందువల్ల ఈ పన్ను సమర్థనీయమేనని ఆయన చెప్పారు.

కొలంబోలో ఫుట్‌బాల్ పోటీలు

మద్రాసుపై ఆంధ్ర జట్టు గెలుపు

కొలంబో, మార్చి 10— ఇక్కడ ప్రారంభమైన "సదరన్ సోకర్ టెంటాగ్యులర్" ఫుట్‌బాల్ పోటీలలో నేడు రెండవ రోజున ఆంధ్రప్రదేశ్ జట్టు మద్రాసు జట్టును 3-0 గోలుల తేడాతో ఓడించింది.

ఉన్నత ప్రమాణాలుగల చలన చిత్రాలు

నిర్మించాలని కేంద్ర మంత్రి డాక్టర్ గోపాలరెడ్డి ఉద్బోధ

మద్రాసు, మార్చి 10— ఉన్నత ప్రమాణాలుకల చలన చిత్రాలను నిర్మించాలని, దానికై చిలిం పరిశ్రమ ప్రతినిధులతో ఒక గోష్ఠిని నిర్వహించాలని కేంద్ర రేడియో, సమాచార శాఖామంత్రి డాక్టర్ బి. గోపాలరెడ్డి నేడు చలన చిత్ర నిర్మాతలకు సూచించారు.

ప్రసిద్ధ తెలుగు సినిమా నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు పేర మద్రాసు యూనివర్శిటీలో ఒక స్కాలర్‌షిప్ ఏర్పాటు చేసే నిమిత్తం ఒక చలన చిత్ర నిర్మాణ సంస్థ మద్రాసు యూనివర్శిటీకి 25 వేల రూపాయలకు చెక్కు సమర్పించిన సందర్భంలో ఏర్పాటయిన సభకు డాక్టర్ గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు

మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ శ్రీ గోపాలరెడ్డి నుంచి ఈ చెక్కును మద్రాసు విశ్వవిద్యాలయం తరపున స్వీకరించారు.

మద్రాసు పట్టణం చలనచిత్ర పరంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకొన్నప్పటికి, ఇంతవరకు రాష్ట్రపతి స్వర్ణ పతకాలు లభించ లేదని కేంద్రమంత్రి అన్నాడు.

దీనికిగల కారణాలను పరిశీలించాలని ఆయన చలనచిత్ర నిర్మాతలను కోరారు.

నెల్లూరులో సంగీతపోటీలు

గానామృత కళామండలి ఆధ్వర్యాన నిర్వాహణ

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నెల్లూరు, మార్చి 11—నెల్లూరు గానామృత కళామండలి ఆధ్వర్యాన స్థానిక పురమందిరంలో రెండు, మూడు తేదీలలో సంగీత పోటీలు జరిగాయి. మూడవ తేదీన పురమందిరంలో శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారి అధ్యక్షతన, గానామృత కళామండలికి ప్రారంభోత్సవం, సంగీతపోటీలలో విజేతలకు సన్మానోత్సవం జరిగాయి.

మొత్తం 60 మంది ఈపోటీలలో పాల్గొన్నారు. 35 మంది బాలురు. 15 మంది బాలికలు, గానామృత కళామండలి ఈపోటీలను నిర్వహించింది.

కళామండలికి నెల్లూరు ప్రభుత్వ ట్రయినింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపాద కృష్ణమూర్తి ప్రారంభోత్సవం చేశారు. గాన మృతమండలి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

సభాధ్యక్షులు శ్రీ రెబాల లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు సంగీత ప్రాశస్త్యాన్ని పునరుద్ధరించడానికి గానామృత కళామండలి ద్వారా డాక్టర్ పి. వి. రామకుందరెడ్డి శ్రీమతి పి. రాజలక్ష్మిగారు చేస్తున్న కృషిని అభినందించారు.

జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి గానామృత కళామండలి సంస్థాపకులను, సంగీత పోటీలలో విజేతలను అభినందించారు.

సంగీత పోటీలలో శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం అనే విద్యార్థి రోలింగ్ షీల్డును గెలుచుకొన్నాడు. పిడేలు వాయిద్యంలో కుమారి నిర్మల వెండికప్పును గెలుచుకొన్నారు. శాస్త్రీయసంగీతంలో కుమారి భారతి బంగారు పతకం సంపాదించింది. ఎస్. శ్రీనివాసులు, కె వెంకటేశ్వర్లు పి రాధాకృష్ణమూర్తిగారలు కుమారి ప్రభా, నటరాజేశ్వరి కూడా బహుమతులు పొందారు. విజేతలకు నెల్లూరు పురపాలక సంఘం అధ్యక్షులు శ్రీ పి. లక్ష్మణగుప్త బహుమతులు పంచిపెట్టారు.

మద్రాసు సినీమా మ్యూజిక్ డైరెక్టరు శ్రీ టి లింగప్ప, ఆంధ్ర ప్రదేశ్ నాట్యమండలి నిర్వాహకులు శ్రీ కొగంటి బోటీలకు జడ్జీలుగా వ్యవహరించారు.

జడ్జీలు, సభాధ్యక్షులు ప్రారంభకులు శ్రీ లక్ష్మణగుప్త, శ్రీ చంద్రశేఖరరెడ్డి, పోటీలలో ప్రముఖ పాత్ర వహించిన వారందరకు గానామృత కళామండలి కార్యదర్శి నూతన వస్త్రాలతో సమాదరించారు.

డాక్టర్ పి వి. రామకుందారెడ్డి వందన సమర్పణ చేశారు.

"నిరాయుధీకరణకు మేము సర్వదా సిద్ధం"

ఆయుధ విసర్జన చేయకపోతే, మనకు వినాశం తప్పదని గ్రోమికో హెచ్చరిక

కోపెన్‌హాగన్, మార్చి 10—

అస్త్ర సన్యాసం చేయడానికి తాము సర్వదా సంసిద్ధమేనని, అన్ని రకాల ఆయుధాలను మనం నాశనం చేయాలని, లేకపోతే అవి మనలను నాశనం చేయగలవని రష్యా విదేశాంగ మంత్రి శ్రీ ఆండ్రీ గ్రోమికో నేడు హెచ్చరించారు.

కోపెన్‌హాగన్ విద్యార్థుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, నిరాయుధీకరణ చర్చలలో అభివృద్ధి జరగనందుకు అమెరికాను ఆయన నిందించారు.

ప్రపంచ శాంతికి పశ్చిమ జర్మనీ ఇంకా ప్రమాదకారిగా వున్నదని ఆయన చెప్పారు.

పశ్చిమ జర్మనీ ప్రభుత్వం నానాటికీ హిట్లర్ అడుగుజాడలలో నడుస్తూ వుండడమే తమకు ఆందోళన కలిగిస్తున్నదని ఆయన అన్నారు.

పశ్చిమ జర్మనీలో పరిస్థితి తీవ్రంగా వున్నదని, ఎండువల్లవంటే ద్వితీయ ప్రపంచ సంగ్రామం తరువాత ఏర్పడిన సరిహద్దులను మార్చించడానికి అది కృషి చేస్తున్నదని ఆయన విమర్శించారు.

ఈ సరిహద్దులను మార్చించడానికి ప్రయత్నించడమంటే, తిరిగి యుద్ధమేనని ఆయన హెచ్చరించాడు.

జర్మనీ ప్రజలపట్ల తమకు ఎలాంటి ప్రతీకారేచ్ఛ లేదని ఆయన అన్నారు.

డాక్టర్ కుచుక్ ఆగ్రా పయనం

న్యూఢిల్లీ, మార్చి 10— సైప్రస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుచుక్ నేటి ఉదయం ఇక్కడినుంచి ఆగ్రా వెళ్ళారు.

ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్, ప్రధాని నెహ్రూ ప్రభృతులు విమానాశ్రయంలో ఆయనకు వీడ్కోలు ఇచ్చారు.

ఎగుమతుల ప్రమాదాల భీమా సంస్థవారు పీమియం పద్ధతిని తగు ప్రోత్సాహం లభించే విధంగా సవరించే విషయమై పరిశీలిస్తున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. పి. దాచ్‌లానీ మార్చి ఎనిమిదవ తేదీన చెప్పినట్టు బొంబాయి వార్త.

సైప్రస్ వైస్ - ప్రెసిడెంట్ డాక్టర్ కుచుక్ ఇండియా పర్యటనకు మొన్న ఢిల్లీ వచ్చినప్పుడు విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్ ప్రభృతులు స్వాగతమిచ్చినప్పటి ఫొటో

ఇండోనీసియా మలయాపై దాడిచేస్తే..

తమకు బ్రిటన్, ఆస్ట్రేలియాలు అండగా వుండగలవని ప్రధాని టుంకు ప్రకటన

మలక్కా, మార్చి 10—

మలయా పట్ల ఇండోనీసియా వైఖరి యుద్ధానికి దారితీస్తే మలయాకు బాసటగా నిలువగలమని బ్రిటన్, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు వాగ్దానం చేసినవని టుంకు అబ్దుల్ రహమాన్ నేడిక్కడ చెప్పారు.

మలయా ప్రధాని టుంకు అబ్దుల్ రహమాన్ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, మలేసియా సమాఖ్య నిర్మాణం జులై 10 వ తేదీ నాటికి సాధ్యం కావచ్చునని ఆశిస్తున్నట్ట తెలియజేశారు.

బ్రిటన్, ఆస్ట్రేలియాలు మలయాకు బాసటగా నిలువగలవని టుంకు ప్రకటించినపుడు ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

యుద్ధం సంభవించి సన్నద్ధయితే లక్షలాది డాలర్లను మనం ఖర్చు పెట్టవలసి వుంటుందని, ఇండోనీసియన్లుకూడా మనకంటె ఎక్కువ మొత్తమే ఖర్చు పెట్టవలసి వుంటుందని ఆయన చెప్పారు.

చివరవరకు పోరాడడమే ఇప్పుడు మలయా ప్రజల లక్ష్యమని ఆయన ప్రకటించారు.

మరణించవలసి వచ్చినా పోరాటాన్ని కొనసాగించాలని, అంతేకాని మరొక దేశానికి బానిసలం కానదానికి అనుమతించరాదని టుంకు ఉద్ఘాటించారు.

ఏ దేశంతో నయినా సంఘర్షణ తెచ్చుకొనాలని మలయా కోరడం లేదని, మన ప్రజలకు సుఖసౌభాగ్యాలను కలిగించ చేయడమే తన లక్ష్యమని ఆయన చెప్పారు.

పశ్చిమ జర్మనీలో బిడా అరెస్టు

ఫ్రెంచి మాజీ ప్రధాని

బాడెన్ (పశ్చిమ జర్మనీ), మార్చి 10— డిగోల్ వ్యతిరేక జాతీయ సమితి అధ్యక్షుడు, ఫ్రెంచి మాజీ ప్రధాని జార్జెస్ బిడాను నేటి ఉదయం ఇక్కడికి సమీపంలో అరెస్టు చేశారు.

ఆయనతో వున్న ఇద్దరు సహాయకులు, ఒక డచ్ జర్నలిస్టుకూడా నిర్బంధింపబడినారు.

శ్రీ మురార్జీ 67 వ జన్మదినోత్సవం

బొంబాయి, మార్చి 10—కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ నేడు 67 వ జన్మ దినోత్సవాన్ని నేడు తన కుటుంబ సభ్యులతో నిరాడంబరంగా జరుపుకున్నారు.

ఆయన మిత్రులు, బంధువులు పెక్కుమంది శ్రీ మురార్జీని ఆయన స్వగృహంలో కలుసుకొని శుభాకాంక్షలు అందజేశారు.

శ్రీ దేశాయ్ రేపు న్యూఢిల్లీ తిరిగి వస్తారు.

పాకిస్తాన్ పేరు మార్పు

ఇస్లామిక్ పదాన్ని కొత్తగా చేర్చడానికి ప్రభుత్వం సంకల్పం

ఢాకా, మార్చి 10—పాకిస్తాన్ పేరును "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్తాన్"గా మార్చడానికి ప్రభుత్వం నిన్న ప్రతిపాదించినది.

ఈ మేరకు జాతీయ అసెంబ్లీలో ఒక బిల్లును ప్రవేశపెట్టారు.

దీనివల్ల కొత్త రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారి కోర్కెలలో ఒకటి నెరవేరుతుంది.

అంతేకాకుండా మానవ హక్కులలో జోక్యం కలిగించుకొనేదిగావున్న ఏ శాసనాన్నయినా న్యాయస్థానాలలో సవాలు చేయడానికి అనుమతించడానికి రాజ్యాంగాన్ని సవరిస్తారు.

చైనాతో పాకిస్తాన్ ఒప్పందం

వాస్తవంగా అధీనంలోవున్న స్థానాలకు అనుగుణంగా వున్నట్టు కరాచీ పత్రిక వ్యాఖ్య

రావల్పిండి, మార్చి 10 — పాకిస్తాన్ ఇటీవల చైనాతో కుదుర్చుకున్న సరిహద్దు ఒప్పందం ముఖ్యంగా, వాస్తవంగా అధీనంలో వున్న స్థానాలకు అనుగుణంగా ఉన్నదని కరాచీనుంచి వెలువడే రాజకీయ వార పత్రిక 'లుక్' తాజా సంచికలో ప్రచురించిన రెండు వ్యాసాలు పేర్కొంటున్నది.

"ఉత్తమము, దౌత్యనీతి" అన్న శీర్షికతో సయ్యద్ నజీ ఉల్లా మొదటి వ్యాసాన్ని వ్రాశాడు.

చైనాతో పాకిస్తాన్ జరిపిన సంప్రతింపుల వివరాలు పూర్తిగా తెలిసే వరకు ఒప్పందాన్ని ఘనమైనదిగా భావించడానికి వీలులేదని ఆయన పేర్కొన్నారు.

పాకిస్తాన్ ఆతృతతో చైనీయుల కంటె ఎక్కువ పద్దుబాట్లకు అంగీకరించినదని కొన్ని అంశాలు సూచిస్తున్నవని ఆయన అన్నారు.

అయితే కాశ్మీర్ సరిహద్దు విషయంలో సంప్రదాయసిద్ధం, చారిత్రకమైన సరిహద్దుకు కాకుండా వాస్తవంగా అధీనంలోవున్న రేఖకు పాకిస్తాన్ అంగీకరించినట్టు విస్పష్టమవుతున్నదని ఆయన చెప్పాడు.

1962 లో చేసిన ప్రకటనలోను ఈ ఒప్పందంలోను సరిహద్దును విభజించే విషయంలో భేదం ఎందుకు కల్పించారని ఆయన ప్రశ్నించారు.

రెండవ వ్యాసాన్ని ఆస్కార్ అలీఖాన్ వ్రాశారు. చైనాతో కుదుర్చుకొన్న ఒప్పందం వాస్తవంగా అధీనంలో వున్న లేఖకు అనుగుణంగా వున్నదని ఆయన అన్నారు.

యునైటెడ్ అరబ్ రిపబ్లిక్‌లో ఇరాక్ రాయబారిగా నియమితుడైన శ్రీ అబ్దుల్ రహ్మాన్ బజాజ్ తన పదవిని స్వీకరించడానికి కయిరో చేరినట్టు మధ్య ఆసియా వార్తా సంస్థ ప్రకటించింది.

సిరియా సరిహద్దులో టర్కీ, జోర్డన్‌ల సేనలు?

ఆ దేశంలో విదేశీయుల జోక్యం సహించబోమని అరబ్ రిపబ్లిక్ హెచ్చరిక

కయిరో, మార్చి 10—

సిరియా సరిహద్దులకు టర్కీ, ఇజ్రాయెల్, జోర్డాన్ సైన్యాలు తరలించబడినట్టు అధికార వర్గాల వారు ఇక్కడ తెలియజేశారు.

దీన్ని పురస్కరించుకుని అరబ్ రిపబ్లిక్ ప్రభుత్వం ఒక హెచ్చరిక చేస్తూ సిరియాలో విదేశీ జోక్యాన్ని సహించబోమని స్పష్టం చేసింది.

సిరియా మాజీ ప్రధాని ఖలీద్ ఎల్ ఆజాం డమాస్కస్‌లోని టర్కీ రాయబార కార్యాలయంలో తలదాచుకున్నట్టు వచ్చిన వార్తలకు, సిరియా సరిహద్దులకు టర్కీ సేనల తరలింపుకు సంబంధం కలదని అభిజ్ఞవర్గాలవారు అంటున్నారు.

ఇటీవల నాసర్ వర్గం ఇరాక్‌లో తిరుగుబాటు తీసుకువచ్చి, విజయం పొందిన వెంటనే సిరియాలో కూడా విప్లవం తీసుకురావడం పెల్‌అబీద్, అమ్మాన్‌లలో ఆందోళన కలిగించినట్టు తెలుస్తున్నది.

పెత్తందారు

"చదువుకు అడ్డు"

కాశ్మీర్ సమస్య:

ఇండో-పాక్ చర్చలు నేడే తిరిగి ప్రారంభం

కరాచీ సభలో ఏర్పడిన విభేదాల దృష్ట్యా ఈసారి క్లిష్ట స్థితి రావచ్చునని ఊహ

కలకత్తాకు సర్దార్ స్వర్ణసింగ్ పయనం

న్యూఢిల్లీ, మార్చి 10—

కాశ్మీర్ సమస్యపై గత నెలలో కరాచీలో మూడవ సారి జరిగిన చర్చలలో ఉభయ దేశాల ప్రతినిధుల మధ్య అభిప్రాయ భేదాలు వ్యక్తమయినందువల్ల ఈసారి కలకత్తాలో జరగనున్న చర్చలు క్లిష్ట స్థాయికి చేరగలవని ఇక్కడ అభిజ్ఞవర్గాల వారు తెలియజేశారు.

కాశ్మీర్, తదితర సమస్యలపై ఇండియా పాకిస్తాన్ మధ్య మంత్రివర్గ స్థాయిలో జరిగే నాలుగవ ఘట్టం చర్చలలో పాల్గొనే భారత ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించడానికై కేంద్ర రైల్వేల మంత్రి సర్దార్ స్వర్ణసింగ్ నేడు ఇక్కడనుంచి రైలులో కలకత్తా బయలుదేరి వెళ్ళారు.

కాశ్మీర్ భూభాగంలో 2,500 చదరపు మైళ్ళ ప్రాంతాన్ని చైనాకు ధారాదత్తం చేస్తూ చైనా-పాకిస్తాన్‌లు ఇటీవల కుదుర్చుకొన్న సరిహద్దు ఒప్పందం ప్రాతిపదికగా మార్చి 12 వ తేదీన కలకత్తాలో తిరిగి చర్చలు ప్రారంభమౌతాయి. ఇండియా, ఈ అక్రమ సరిహద్దు ఒప్పందం పట్ల చైనా, పాకిస్తాన్‌లకు నిరసన తెలియజేసింది. అన్యాయంగా తాము ఆక్రమించుకొన్న భారత భూభాగంపై పాకిస్తాన్‌కు ఏ విధమైన హక్కు లేదని, సరిహద్దు ఒప్పందంగా చెప్పబడుతున్న ఈ ఒప్పందం అర్థరహితమని ఇండియా కరాచీకి స్పష్టం చేసింది.

కాశ్మీర్‌పై చర్చల సందర్భంలో జమ్ము ప్రాంతంలో ఒకటి, రెండు జిల్లాలు తప్ప మొత్తం జమ్ము, కాశ్మీర్ రాష్ట్రమంతా తమకు చెందాలని పాకిస్తాన్ ప్రతిపాదిస్తున్నదని, కాశ్మీర్ లోయపై ఇండియా సార్వభౌమత్వానికి పరిమిత విధించే ఏ ప్రతిపాదన అయినా తమకు అంగీకార యోగ్యం కాదని ఇండియా సూచించిందని అభిజ్ఞ వర్గాలవల్ల తెలుస్తున్నది.

కాశ్మీర్‌లోని పాకిస్తాన్ ఆక్రమిత ప్రాంతం సరిహద్దుపై చైనాతో కుదుర్చుకొన్న ఒప్పందం విషయమై ఇండియా వైఖరిని పాకిస్తాన్ ప్రతినిధులకు భారత ప్రతినిధులు స్పష్టం చేయవలసి వున్నది.

కాశ్మీర్ సమస్యపై రావల్పిండి, ఢిల్లీలలో జరిగిన ప్రదక్షిణీయ చట్టం చర్చలలో తాము సరిహద్దు ఒప్పందం కుదుర్చుకొననున్నట్టు చైనా, పాకిస్తాన్‌లు చేసిన ప్రకటనలపై భారత ప్రభుత్వం అభిప్రాయాలను సర్దార్ స్వర్ణసింగ్ వివరించారు.

చైనాతో పాకిస్తాన్ సరిహద్దు ఒప్పందం కుదుర్చుకొనడం కాశ్మీర్‌పై కరాచీలో జరిగిన చర్చలలో పాకిస్తాన్ చేసిన అనుచితమైన ప్రతిపాదనలు, ఇండో, పాక్ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొనడానికి అది ఆసక్తి చూపడం లేదన్నట్టు స్పష్టమౌతున్నదని ఇక్కడ పరిశీలకులు వివరించారు.

ఇది ఇలా వుండగా పాకిస్తాన్ చైనాతో ఆక్రమ సరిహద్దు ఒప్పందం కుదుర్చుకొన్నప్పటికి, పాకిస్తాన్‌తో గౌరవప్రదమైన ఒప్పందం కుదుర్చుకొనడానికి ఇండియా తన కృషిలో లోపం చేయబోదని భారత ప్రధాని శ్రీ నెహ్రూ అనేక పర్యాయాలు ప్రకటించారు.

ఇండియాకు ఆస్ట్రేలియా సహాయం

212 లక్షల రూపాయల మేరకు అందగలదని ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 10— ఆస్ట్రేలియా గత నవంబర్‌లో నిర్ణయించిన దానికంటె రెట్టింపు సహాయాన్ని ఇండియాకు అందజేయాలని నిశ్చయించింది.

ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి సర్ గార్‌ఫీల్డ్ బార్విక్ నేడు కాన్‌బెర్రాలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆస్ట్రేలియా ప్రభుత్వం 212 లక్షల రూపాయల మేరకు ఇండియాకు సహాయం చేయాలని నిశ్చయించినట్టు తెలియజేశారు.

గత నవంబర్‌లో ఇండియాకు 110 లక్షల రూపాయల మేరకు సహాయం చేయగలనని ఆస్ట్రేలియా ప్రకటించింది.

రైఫిల్స్, తుపాకీ గుండ్లను ఉచితంగా ఇండియాకు సప్లయి చేయాలని లోగడ భావించినప్పటికి, ఇప్పుడు ఉచితంగానే వాటిని అందజేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిశ్చయించినట్టు శ్రీ బార్విక్ ప్రకటించారని న్యూఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

ఇండియా ప్రభుత్వం కోరిన రైఫిల్స్ కూడ నౌకలో రవాణా చేయడం జరిగిందని ఈ పత్రిక ప్రకటన తెలిపింది.

మూడు లక్షల పౌండ్ల విలువగల దుప్పట్లు, నైలక్ దుస్తులు కూడా ఇండియాకు పంపడం జరిగిందని ఈ ప్రకటన వివరించింది.

రక్షణ నిధికి రు. 2,076 వసూలు

విజయవాడ రైల్వే సిబ్బంది భార్యల కృషి

విజయవాడ, మార్చి 10— విజయవాడ రైల్వేస్టేషన్, డివిజనల్ కార్యాలయాలలోని రైల్వేసిబ్బంది భార్యలు నిన్న ఇక్కడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సైనికుల సంక్షేమ నిధి సహాయార్థం ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఈ ప్రదర్శన నిర్వహణకు ఏర్పాటయిన కమిటీ అధ్యక్షురాలు, విజయవాడ డివిజనల్ సూపరింటెండెంట్ సతీమణి శ్రీమతి అన్నమ్మ నరసేశ్వరన్ నేటి రాత్రి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ సైనిక సంక్షేమ నిధికి నిన్నటి ప్రదర్శన వల్ల, వసూలైనది, బిట్రగుంటలోని రైల్వే సిబ్బంది భార్యలు సేకరించిన మొత్తం 2,076 రూపాయల వరకు వసూలైనట్టు తెలియజేశారు.

అత్యయిక పరిస్థితి

దేశంలో ఉపఎన్నికలు ముగిసేవరకు తొలగించాలని శ్రీ ఎ. కె. గోపాలన్ ప్రకటన

మద్రాసు, మార్చి 10— పార్లమెంటులోను, రాష్ట్రశాసనసభ్యులలోను ప్రధాన ప్రతిపక్షానికి చెందిన సభ్యులు ఇండియా రక్షణ చట్టంక్రింద నిర్బంధంలోవున్న సమయంలో లోకసభ, అసెంబ్లీ నియోజక వర్గాలలో ఉపఎన్నికలను నిర్వహించడం సమంజసం కాదని కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ మొన్న ఇక్కడ అన్నారు.

శ్రీ గోపాలన్ నిన్న సాయంత్రం ఇక్కడొక ప్రకటనను చేస్తూ అత్యయిక పరిస్థితిలో ప్రతిపక్షం వారు ప్రభుత్వాన్ని ఎలా విమర్శించగలరు? అని ప్రశ్నించారు.

ఉపఎన్నికలు ముగిసే వరకు అత్యయిక పరిస్థితిని తొలగించి వేయాలని, నిర్బంధంలో వున్న నాయకులను అందరిని విడుదల చేయాలని ఆయన కోరారు.

అలా జరగని పక్షంలో అత్యయిక పరిస్థితి ముగిసేవరకు ఉపఎన్నికలను వాయిదా వేయాలని ఆయన సూచించారు.

కేంద్ర బడ్జెట్టును గురించి ప్రస్తావిస్తూ సామాన్య మానవునిపై పన్నులభారం అధికమైనదని ఆయన అన్నారు.

తేయాకు, కాఫీ, సబ్బులు, పొగాకు, నూలు, కిరసనాయిలు మొదలైనవాటిపై పన్నులను విధించడం అనవసరమని ఆయన చెప్పారు

సింహళం ప్రభుత్వం వలెనే భారత ప్రభుత్వం కూడా విదేశీ పెట్రోలియం కంపెనీలను జాతీయం చేయాలని ఆయన అన్నారు.

గోష్ఠుల ఏర్పాటు విషయంలోను, మంత్రుల, అధికారుల ప్రయాణ భత్యాల విషయంలోను అనవసరపు ఖర్చును తొలగించాలని ఆయన చెప్పారు.

1961-62 లో ఆంధ్రలో మంత్రులు, అధికారుల పర్యటనకు 1.6 కోట్ల రూపాయలు ఖర్చయినవని ఆయన వివరించారు.

అఫ్ఘనిస్తాన్ ప్రధాని రాజీనామా

న్యూఢిల్లీ, మార్చి 10— అఫ్ఘనిస్తాన్ ప్రధాని సర్దార్ దావుద్ ఖాన్ తన పదవికి రాజీనామా చేశారని ఆలిండియా రేడియో నేటి ఉదయం ప్రసారం చేసింది.

అఫ్ఘన్ రాజు ఈ రాజీనామాను ఆమోదించారని, అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆ పదవిలోనే వుండవలసిందిగా సర్దార్ దావుద్‌ని కోరారని రేడియో వెల్లడించింది.

కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా గనుల శాఖామంత్రి డాక్టర్ మహమ్మద్ యూసఫ్‌ను అఫ్ఘన్ రాజు కోరారు.

సర్దార్ దావుద్ ఖాన్ తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రధానిగా వుంటున్నారు.

మహారాష్ట్రీ ఆర్థిక మంత్రి శ్రీ సదాశివ భార్వే మార్చి 8 వ తేదీన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజాశాసకులకు కేంద్ర ప్రభుత్వం చేయగల సహాయాన్ని శాస్త్రీయ పథకాన్ని బట్టి నిర్ణయించడం అవసరమని చెప్పినట్టు బొంబాయి వార్త.

క్రమశిక్షణతో మతప్రచారం

ప్రదేశ్ క్రైస్తవ మత విస్తరణ సభలో మంత్రిణి శ్రీమతి సదాలక్ష్మి వివరణ

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

కర్నూలు, మార్చి 11— "భారతదేశంలోని ఏ మతమైన సత్యం, అహింస, ధర్మం వంటి నీతులను ప్రచారం చేసేటప్పుడు ప్రతిమానవుడు తమ తమ మతాలద్వారా మోక్షానికి వెళ్ళాలనే ప్రచారం చేస్తాడు. అలాంటప్పుడు మతాలను ఎవ్వరు వ్యతిరేకించరు"అని మూడవ తేదీన ఇక్కడజరిగిన ఆంధ్రప్రదేశ్ క్రైస్తవమత విస్తరణ మహాసభను ప్రారంభిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిణి శ్రీమతి టి.ఎన్. సదాలక్ష్మి వివరించారు.

ఈ మహాసభకు శ్రీ జి నోబుల్ వందనం అధ్యక్షత వహించారు ప్రారంభంలో క్రైస్తవ మతానికి సంబంధించిన ప్రార్థనలు జరుపబడ్డాయి. అహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ గాలి రాజరత్నం స్వాగతం చెప్పారు.

క్రైస్తవ మతాలుగాని, మరే మతాలుగాని తమతమ మతాలను క్రమశిక్షణతో, సక్రమైన పద్ధతులతో నీతి నిజాయితీగా ప్రచారం చేసుకోవాలని, మతాల పేరిట మతాలను మలినం చేయరాదని మంత్రిణి విజ్ఞప్తిచేశారు

తర్వాత డాక్టరు రాజేంద్రప్రసాదు మరణానికి సభ సంతాపం తెలిపినది.

ప్రారంభంలో శ్రీ కేమ్సు డి. ఐజాక్ ప్రసంగించారు. శ్రీ గాలి రాజరత్నం వందన సమర్పణ చేశారు.

వై.సూర్యనారాయణ రావుకు సన్మానం

డాక్టర్ లక్ష్మీపతి జయంతి సందర్భంలో తెనాలిలో

తెనాలి, మార్చి 11— శ్రీ లక్ష్మీపతి ఆయుర్వేద గురుకులంలో జరిగిన డాక్టర్ లక్ష్మీపతి 84వ జయంతి సభకు ఆంధ్రీ ఆయుర్వేద బోర్డు అధ్యక్షులు డాక్టర్ వై. సూర్యనారాయణరావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ ఆయుర్వేద మహామండలి ప్రధాన కార్యదర్శి శ్రీ కవిరాజమోహన్ ప్రసంగిస్తూ ఆయుర్వేదోద్యమంలో ప్రథమ తరం శ్రీ లక్ష్మీపతిగారు పరమపదించడంతో అంతమైనదని అంటూ ప్రథమ తరం వారి ఆశయాలు మే ఒక్కటి సాధనకు రాలేదని అన్నారు.

తరువాత ఆయుర్వేదాచార్య శ్రీ ముదగు విశ్వేశ్వరశాస్త్రిగారి అధ్యక్షతను డాక్టర్ వై. సూర్యనారాయణరావు సన్మాన సభ జరుపబడింది. ఆయుర్వేదాచార్య శ్రీ వెంకటి కోటేశ్వరశాస్త్రి సభను ప్రారంభించారు. పై సభలు శ్రీ లక్ష్మీపతి ఆయుర్వేద గురుకుల వ్యవస్థాపకులు, ఉపాధ్యాయ విద్యార్థి బృందంచే ఏర్పాటు చేయబడ్డాయి. శ్రీ ఎన్ రమేశ్ బాబు సన్మానపత్రం శ్రీ పుల్లాపంతుల గవరయ్యపంతులు నూతన వస్త్రాలు గురుకులం తరపున సమర్పించారు. శ్రీ యుతులు శిష్టా సుబ్రహ్మణ్య శాస్త్రి, వల్లూరు సుబ్బారావు, సిరిపురపు సేతు మాధవరావు, మల్లెల శోభనాచల తంత్రప్రవర్తి, కందుసుబ్బారావు, అవనిగడ్డ నాగభూషణం మొదలైన వారు సన్మానితులను అభినందించి శుభాకాంక్షలు సమర్పించారు.

శ్రీ సూర్యనారాయణరావు తమకు జరిగిన సన్మానానికి కృతజ్ఞత తెలిపారు. శ్రీ కవిరాజ్ మోహన్ వందన సమర్పణ చేశారు.

విశాఖపట్నంలో పండిత సన్మానం

విశాఖపట్నం, మార్చి 11— స్థానిక అల్లిపురంలోని శ్రీ రామ బాల భక్తి గ్రంథాలయంలో బ్రహ్మ శ్రీ శివకోటి వరాహ నృసింహశాస్త్రిగారికి కవి సన్మానం జరిగింది. ఆచార్య గంటి జోగి సోమయాజి సన్మాన సభకు అధ్యక్షత వహించారు.

శ్రీ ఎం.ఎ. రెడ్డి సభను ప్రారంభించారు అంతకుముందు కవివి పూరేగించారు. శ్రీయుతులు దివాకర్ల రామమూర్తి, రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రి తదితరులు ప్రసంగించారు.

శ్రీ రామ బాల భక్త గ్రంథాలయం, భారత త్రినాథసేవా సమితి సన్మాన పత్రాలు సమర్పించాయి. కవికి 1,116 రూపాయలు నిధి సమర్పించబడింది. కార్యదర్శి శ్రీ డి. రామిరెడ్డి వందన సమర్పణ చేశారు.

భీమవరంలో మహారుద్రయాగము

భీమవరం, మార్చి 11—ప్రపంచశాంతి, లోక కళ్యాణార్థంస్థానిక వర్తక సంఘ భవనంలో ఇటీవల నవతరుణీయాగ సహిత మహారుద్రయాగముకు కలశ స్థాపన చేయబడినది. శ్రీ పరమహంస, సుబ్రహ్మణ్య భారతీ స్వామివారు యాగపర్యవేక్షకులుగా వుంది అతిథైభవముగాను, వేదోక్తముగాను యాగములను జరిపించుచున్నారు. మైనారు నుంచి, యితర దూర దేశాలనుంచిన్ని ఋత్విక్కులనుకూడ రప్పించినారు. యీజిల్లాలోని భక్తులు చాలామంది హాజరయినారు. ఈ యాగములు 11 రోజులు జరుగుతవి. యాగనిర్వహణ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు గావించినారు. మునిసిపల్ ఆరోగ్యశాలవారు స్పెషల్ ఆఫీసర్ శ్రీ పి. వి. శంకరరావు తగు ఏర్పాట్లు చేశారు.

ముడి పొగాకుపై అదనపు సుంకం

విధించరాదని పలాస వర్తకుల తీర్మానం

పలాస, మార్చి 11—పలాస కాకిబుగ్గ పొగాకు వర్తకులు, చుట్టల వ్యాపారుల సంఘం అత్యవసర సమావేశం ఇటీవల ఇక్కడ జరిగింది. శ్రీ కల్బి జగన్నాథం అధ్యక్షత వహించారు. ముడి పొగాకుపై అదనపు సుంకం విధించడానికి చేసిన ప్రతిపాదనలు ఉపసంహరించు కోవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని అర్థిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ముడి పొగాకుపై విధించిన సర్‌చార్జీకూడా ఉపసంహరించాలని కోరారు.

పొగాకుపై అదనపు సుంకం

ఉపసంహరించాలని ఇచ్ఛాపురం తాలూకా పొగాకు వర్తకుల తీర్మానం

ఇచ్ఛాపురం, మార్చి 11—ఇచ్ఛాపురం తాలూకా పొగాకు వర్తక సంఘం అసాధారణ సమావేశం ఇటీవల జరిగింది. శ్రీ కె. జియ్యారావుస్వామి అధ్యక్షత వహించారు. దేశవాళీ ముడిపొగాకుపై అదనపు సుంకం, సర్‌చార్జి విధింపు ప్రతిపాదనలు ఉపసంహరించవలసిందిగా ప్రభుత్వాన్ని అర్థిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ప్రతిపాదనలు పొగాకు పరిశ్రమను కుంటుపరుస్తాయని, నన్నకారు పొగాకు వినియోగదారులకు కూడా అసౌకర్యం కలిగిస్తాయని వివరించారు. నూరు దేశవాళీ పొగాకుచుట్టల నిష్కయంపై అదనపు పన్ను మినహాయింపు కొనసాగించాలని కూడా అర్థించారు.

కవిగిరి హైస్కూల్ విద్యార్థుల సమ్మె

పీపుల్స్ లీడర్ తొలగింపుకు నిరసనగా

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నెల్లూరు, మార్చి 11— కవిగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు మొన్న సమ్మెచేశారు.

స్కూల్ పీపుల్స్ లీడర్‌ను పాఠశాల అధికారులు తొలగించినందుకు నిరసనగా విద్యార్థులు సమ్మెచేశారు.

కవిగిరి తాలూకా పర్యటన సందర్భంలో ఆక్కడవున్న నెల్లూరు జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ పి. మల్లికార్జునంగారు జోక్యం కలుగజేసుకొన్న ఫలితంగా విద్యార్థులు తిరిగి మధ్యాహ్నపు తరగతులకు హాజరయ్యారు.

పీపుల్సు లీడరును తిరిగి పాఠశాలలో జేర్చుకొన్నారు.

ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ ఉద్యోగుల సహకార సంఘం

కొత్త డైరెక్టర్ల ఎన్నిక

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

బందరు, మార్చి 11— స్థానిక ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ. దానిసహాయ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల సహకార సంఘ సర్వసభ్యమండలి సమావేశం ఇటీవల శ్రీ బి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగింది. శ్రీ యుతులు లంకా కృష్ణమూర్తి టి. లక్ష్మీనారాయణ, ఎ. వి. హనుమంతరావు, కె. శ్రీరాములు, పి. నాంచారయ్య బి. సూర్యచంద్రరావు, డి. రాజారావు కొత్త సంవత్సరానికి డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి శ్రీ ఎల్. కృష్ణమూర్తి నివేదికను సమర్పించారు.

తరువాత డైరెక్టర్లు సమావేశమై శ్రీ లంకా కృష్ణమూర్తిని అధ్యక్షుడుగాను, శ్రీ తంగిరాల లక్ష్మీనారాయణను కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

వివాహ మహోత్సవాలు

రాజమండ్రి, మార్చి 11— తూర్పుగోదావరి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ తేతలి లక్ష్మీనారాయణ రెడ్డి(మాజీ శాసన సభ్యులు) తమ ప్రథమ పుత్రిక చిరంజీవి సౌభాగ్యవతి శేషారత్నమును రామచంద్రపురం తాలూకా కొమరిపాలెం వాస్తవ్యులు శ్రీ పడాల రామిరెడ్డి పుత్రుడు చిరంజీవి అమ్మిరెడ్డికి, ఇచ్చి ఫిబ్రవరి 28 వ తేదీన కొమరిపాలెంలో వైభవంగా వివాహం జరిపారు పలువురు అధికార-అనధికార ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర మంత్రులు పలువురు శుభాశీస్సులు పంపారు.

* * *

కర్నూలు, మార్చి 11—కర్నూలు జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ విపర్తి వెంకట సుబ్బయ్యగారి కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి సౌమిత్రి సీతాలక్ష్మికి చిరంజీవి శ్రీధర్‌కు నంద్యాలలో ఇటీవల వివాహం జరిగింది.

అనేకమంది ప్రముఖులు వివాహానికి హాజరయ్యారు. రాష్ట్రపతి, ముఖ్యమంత్రి కాంగ్రెసు అధ్యక్షులు, కేరళ గవర్నర్, శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు, అనేక మంత్రులు శుభాకాంక్షలు పంపారు.



రాజపాలెం హైస్కూల్ వార్షికోత్సవం సందర్భంలో తీయబడిన ఫొటో. శ్రీయుతులు డి. పాండురంగారెడ్డి, మద్దూరు సుబ్బారెడ్డి, ఎం. భాస్కరరెడ్డి, సి. వెంకయ్యగారలు ఇందలో కలరు. వార్షిక నివేదికను చదువుకున్న వారు ప్రధానోపాధ్యాయులు శ్రీ శామ్యూల్ జార్జి

శ్రీ రాజెన్‌బాబుకు ఆంధ్ర ప్రజల నివాళులు

విజయవాడ, మార్చి 11— శాంతిదూత మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆత్మశాంతికి ఒకటవ తేదీనుంచి 8 వ తేదీవరకు ప్రతిరోజూ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు సేవాదళంతరపున ప్రార్థనలుజరిపారు. సేవాదళం తరపున మృతవీడనకు జోహార్లర్పించారు.

హైదరాబాద్

మూడవతేదీన హైదరాబాద్ సర్వోదయ పాత్ర అన్నికేంద్రాల సేవాసేన కార్యకర్తలు డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతను చిక్కడపల్లి కేంద్ర భవనంలో రాజెన్ బాబు ఆత్మశాంతికి ప్రార్థనలుజరిపి, సంతాప తీర్మానంచేశారు.

వినయాశ్రమం

వినయాశ్రమంలో జరిగిన సంస్మరణ సభలో శ్రీ తుమ్మల బసయ్య రాజెన్‌బాబు మృతికి తమ గాఢసంతాపాన్ని వెలిబుచ్చారు.

రేపల్లె

రేపల్లె పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో జరిగిన సంతాపసభకు చైర్మన్ శ్రీ నేతి వెంకటరమణ అధ్యక్షత వహించారు. శ్రీ యుతులు పి. గోపాలకృష్ణమూర్తి, కొండూరి సీతారామయ్య, గొల్లపూడి సుబ్రహ్మణ్యం, ఎన్. వాసుదేవాచారి గారల సభలో ప్రసంగించారు.

నాల్గవ తేదీన జరిగిన పురపాలక సంఘం అసాధారణ సమావేశంలో సంతాప తీర్మానం చేశారు.

అవనిగడ్డ

అవనిగడ్డ సి బి ఎం. హైయర్ ఎలిమెంటరీ పాఠశాలలో రాజెన్‌బాబు మృతికి సంతాపం ప్రకటించడానికి జరిగిన సభకు శ్రీ ఇ జె. జయపాల్ అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు పెరికె జోసఫ్, పి. జాన్ సుదర్శనరావు, ధనరాజు గారలు రాజేంద్ర ప్రసాద్ జీవిత విశేషాలను వివరించారు.

ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణ కాంగ్రెసు కార్యాలయంలో శ్రీ పోతల కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత క్రింద సంతాపసభ ఏర్పాటు చేయబడింది. శాసన సభ్యులు శ్రీ కీర్తి చంద్రదేవ్ తదితరులు సభకు హాజరయ్యారు రాజెన్‌బాబు మృతికి సంతాపం ప్రకటిస్తూ వారికుటుంబానికి సానుభూతి తెలిపారు.

వెంకటాయపాలెం

వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాలలో సానుభూతి సభజరిపారు. రాజెన్‌బాబు ఆత్మశాంతికి ప్రార్థనలు జరిపారు.

పిఠాపురం

మాజీ - రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నిర్యాణానికి సంతాప సూచకంగా ఇక్కడ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు మూసివేశారు. కిర్లంపూడి పంచదార ఫ్యాక్టరీ కార్మికులు, సిబ్బంది మౌనంగా ఊరేగింపు జరిపారు. ఆ తరువాత జరిగిన బహిరంగ సభలో పలువురు ప్రసంగిస్తూ రాజెన్‌బాబుకు శ్రద్ధాంజలి ఘటించారు.

చీరాల కౌన్సిల్ జోహార్లు

స్వాతంత్ర యోధుడు, శాంతిదూత, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నిర్యాణానికి విచారిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియపరుస్తూ శ్రీ వడ్డి నాగేశ్వరరావుగారి అధ్యక్షతను జరిగిన సమావేశమై పట్టణంలో మరికొన్ని సిమెంట్ రోడ్లు వేయడానికి పెద్దలు ఆమోదించింది

వెనుకబడిన తరగతులకు చెందిన ఇద్దరు నిరుపేదలకు చెరి ఆయిదు సెంట్లనంతున ఇండ్ల స్థలాన్ని మంజూరు చేయడానికి చైర్మన్‌కు అధికార మిస్తూ కూడా తీర్మానించారు.

పెనమలూరు

పెనమలూరులోని గాంధి ఘర్ లో శ్రీ కిలారు లక్ష్మీ నారాయణ అధ్యక్షతన సభ జరిపి సంతాపం వెల్లడించారు శ్రీయుతులు వెంకటేశ్వరరావు, ఎం వి చౌదరి తదితరులు సభలో ప్రసంగించారు. రాజెన్‌బాబు ఆత్మ శాంతికి భజనచేశారు.

పొన్నూరు

పొన్నూరు, నిడుబ్రోలుల లోని వ్యాపార, విద్యా తదితర సంస్థలు మూసివేశారు.

పొన్నూరులో క్లాత్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ వారు శ్రీ ఎ శేషగిరిరావు అధ్యక్షతను సంతాప సభ జరిపారు.

తెనాలి

శ్రీ లక్ష్మీపతి ఆయుర్వేద గురుకుల భవనంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద మహామండలి, గుంటూరు జిల్లా శాఖ సభలో అజాత శత్రువు రాజేంద్ర బాబుకు జోహార్లర్పించారు.

వేటపాలెం

వేటపాలెం పౌరులు శ్రీ వసుపర్తి నిత్యానందం అధ్యక్షతను సమావేశమై భారతరత్న రాజెన్‌బాబు నిర్యాణానికి తమ సంతాపం ప్రకటించారు. శ్రీ యుతులు అడనుపల్లి శ్రీనివాసరావు, లేళ్ళ సాంబశివరావుగారలు రాజెన్‌బాబు జీవిత సంగ్రహాన్ని వివరించారు.

మరిపడ

మరిపడ గ్రామస్తులు, అన్ని సంస్థల సభ్యులు, మరిపడ సమితి ఉద్యోగులు సమావేశమై రాజెన్‌బాబు మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

శ్రీయుతులు పరవరరావు, శేషగిరిరావు, డి. అనంతయ్య, వై. డి. ఎన్. శర్మగారలు ప్రసంగించారు.

ఖమ్మం

ఖమ్మం జిల్లా పాత్రికేయుల సంఘం ఇటీవల ఖమ్మంలో శ్రీ హీరా లాల్ మోరియా అధ్యక్షతన సమావేశమై రాజెన్‌బాబు మృతికి సంతాప సూచకంగా ఒక నిమిషం మౌనం పాటించారు.

గోకినేపల్లి

గోకినేపల్లిలో హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు హైస్కూల్ ఆవరణలో శ్రీ కాళేశ్వరశాస్త్రి అధ్యక్షతను సభ జరిపి రాజెన్ బాబు మృతికి సంతాపం వెల్లడించారు.

శ్రీయుతులు చావా వెంకట కోటయ్య, రావులపాటి సీతారామారావు, రావెళ్ళ వెంకట్రామారావు చావా లక్ష్మయ్య, ఎస్ పాపారావు, జి ప్రసాద్ శర్మ డాక్టర్ ప్రసాద్ గారి జీవిత విశేషాలను వివరించారు.

విజయనగరం

విజయనగరం ఆయోధ్య మైదానంలో శ్రీ భట్టం శ్రీరామమూర్తి అధ్యక్షతన క్షౌరవృత్తి కార్మికుల మహాసభ జరిగిన సందర్భంలో రాజెన్‌బాబు మృతికి సంతాపం ప్రకటించారు

నల్లగొండ

నల్లగొండలో రాజేంద్ర ప్రసాద్ మరణానికి సంతాప సూచకంగా పూర్తి హర్తాళ్ జరిగింది అన్ని సంస్థలు, కార్యాలయాలు మూసివేశారు. నల్లని బ్యాడ్జిని ధరించి వూరేగింపు జరిపారు.

గాంధిపార్కులో శ్రీ కాదిరెడ్డి నరసింహగుప్త అధ్యక్షతను జరిగిన సభలో శ్రీ టి. వెంకటనారాయణ సంతాప తీర్మానం ప్రతిపాదించారు. శ్రీయుతులు పులిజాల రంగారావు, జి. ఎస్. రెడ్డి, కె. రామకృష్ణారెడ్డి, సి. హెచ్. శంకరరావు (ఎం. ఎల్. సి) రామమూర్తి, మహమ్మద్ జాన్ అన్సారీ, కె. రామిరెడ్డి సోమవరపు ముత్తయ్య, బృందావన్‌దాస్, రామిరెడ్డి, కమల కుమారి తదితరులు మాట్లాడారు.

శాంతి మంత్రంతో సభ ముగిసింది.

పుయ్యూరు

పుయ్యూరు పట్టణ జనసంఘ కార్యవర్గ ఇటీవల సమావేశమై బాబూ రాజేంద్ర ప్రసాద్ నిర్యాణానికి తమ సంతాపం వెల్లడిస్తూ తీర్మానించారు.

నిడదవోలు

నిడదవోలులో ఒకటవ తేదీన కొట్లు మూసివేశారు. ఆంధ్ర ప్రదేశ్ తాటిబెల్లం సహకార పరిషత్ నిల్చింది, విజ్ఞాన కళాశాల విద్యార్థులు, అభ్యుదయ సమితి జూనియర్ చేసిన విద్యాలయంవారు వేరువేరుగా సంతాప సభలు జరిపారు.

నర్సరావుపేట

నర్సరావుపేట పట్టణ, తాలూకా వెనుకబడిన జాతుల సంఘాలు ఆధ్వర్యాన బస్సు స్టాండులో పి. సి. సి. సభ్యులు శ్రీ కె కాశీరామారావు అధ్యక్షతను సంతాప సభ జరిపారు. శ్రీయుతులు నండ్యాల కోటిరెడ్డి, ఎం. పరవస్తుదాసు, మురుగుల సీతారామయ్య, పిల్లి సుబ్బయ్య, నాగభూషణం, ఎ. గురుమూర్తిరాజు తదితరులు రాజెన్ బాబుకు జోహార్లర్పిస్తూ ప్రసంగించారు.

పట్టణంలోని పెంపరింగ్ షాపులను మూసివేసి జనబ్‌షేక్ ఇమామ్‌కు సాహెబ్ అధ్యక్షతను సంతాపం ప్రకటించి ప్రార్థనలు జరిపారు.

బందరు

బందరు హిందూ కళాశాల అడిటోరియంలో, విద్యార్థులు అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అధ్యక్షతను సంతాప సభ జరిపారు శ్రీయుతులు వై. రామచంద్రరావు, వై. వెంకటేశ్వరరావు, గోఖలే, విఠల్‌రావు గారలు సభలో ప్రసంగించారు.

సత్తెనపల్లి

సత్తెనపల్లి గాంధీ చౌక్‌లో జనసంఘం ఆధ్వర్యాన జరిగిన సభలో మృత వీరునకు జోహార్లర్పించారు. శ్రీ గ్రంథి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సభలో శ్రీయుతులు కూనాగు వెంకట శేషయ్య, కొల్లిపర్ల వెంకటేశ్వర్లు, గోపాలరావు, తాహర్ ప్రసంగించారు. శ్రీ సుఖమంచి వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు.

'స్వాతంత్ర్య రక్షణకు విద్యార్థులు ఎట్టి త్యాగాలైనా చేయాలి'

నల్గొండ కళాశాలలో ప్రసంగిస్తూ మంత్రి చెన్నారెడ్డి ఉద్బోధ

నల్గొండ, మార్చి 11—విద్యార్థులు విద్యార్జనతోపాటు, అర్థికంగా అర్జన చేయాలని ప్రణాళికా శాఖామంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి ఇటీవల ఇక్కడ నాగార్జున కళాశాల వీడ్కోలు ఉత్సవ సభలో ప్రసంగిస్తూ ఉద్బోధించారు. విదేశాలలో విద్యార్థులు చదువుతోపాటు, అర్థిక సంపాదన చేస్తారని ఆయన అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో చేరికైనా ఎం. ఎ పరీక్ష పూర్తి చేసిన ఉదంతాన్ని మంత్రి ఉటంకించారు.

తెలంగాణ ప్రాంతీయ సంఘంఅధ్యక్షుడు శ్రీ టి. హయగ్రీవాచారి అధ్యక్షత వహించారు.

ప్రిన్సిపాల్ శ్రీ జె. సి. ఆస్తానా మంత్రికి ఆహూతులకు స్వాగతం చెప్పారు కళాశాలకు ఆటస్థలం ఏర్పాటుచేయాలని ఆయన అర్థించారు.

మంత్రి శ్రీ చెన్నారెడ్డి తన ప్రసంగంలో చైనా దురాక్రమణ గురించి ప్రస్తావించి, కష్టపడి ఆర్జించికొన్న స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవడానికి విద్యార్థులు ఎట్టి త్యాగాలైనా సంసిద్ధులై వుండాలని చెప్పారు. కళాశాల విద్యార్థులు రక్షణ నిధికి రెండు వేల రూపాయలు సమర్పించినందుకు ఆయన వారిని అభినందించారు. విజేతలకు మంత్రి బహుమతి ప్రదానం చేశారు. శ్రీ ప్రకాశ్ రెడ్డికి, శ్రీ మూర్తికి యిచ్చిన ఆయిదు రూపాయల బహుమతి బాంబ్లను వారు రక్షణ నిధికి సమర్పించారు. వాటిని వేలం వేయగా 232 రూపాయలకు పాడారు. ఆ మొత్తాన్ని రక్షణ నిధికి సమర్పించారు.

ఇంగ్లీషు, ఉర్దూభాషలలో ఎక్కువ మార్కులు వచ్చిన కుమారి షమ్సునీస్సాకు బహుమతు లిచ్చారు.

విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీ పి. మల్లారెడ్డి వందన సమర్పణ చేశారు. జిల్లా పౌర సంబంధాల అధికారి రక్షణ కృషి వివరించే ప్రదర్శన ఏర్పాటు చేశారు.

పంజాబ్ ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్ కైరాన్ మార్చి పదవ తేదీన మాట్లాడుతూ, విదేశ దురాక్రమణ ప్రతిఘటనకై దేశాన్ని సమాయత్తం చేయడానికి జాతీయ రక్షణ నిధికి ప్రజలెవరు తన వార్షిక ఆదాయంలో పదిశాతం ఒకవంతును విరాళముగా యివ్వాలని ఉద్బోధించినట్టు జలంధర్ వార్త.

జగ్గయ్యపేటలో వాసవీ గ్రంథాలయం వార్షికోత్సవం

జగ్గయ్యపేట, మార్చి 11 — స్థానిక శ్రీ వాసవీ గ్రంథాలయం వారి నూతన భవనానికి గత రెండవ తేదీన శ్రీ సోమల చిన సుబ్బయ్య ప్రారంభోత్సవం చేశారు

శ్రీ చౌపరపల్లి రామగోవిందం జండా ప్రతిష్ఠాపన చేశారు.

మూడవ తేదీన గ్రంథాలయ వార్షికోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ కార్మిక మంత్రి శ్రీ కె. వి. గురుమూర్తి అధ్యక్షత వహించారు. శాసన సభ్యుడు శ్రీ కొత్తూరి నీలయ్య గుప్త ప్రారంభోత్సవం చేశారు.

శ్రీ జి నాగేశ్వరరావు, శ్రీ కల్వకుంట్ల కార్జునరావు మంత్రికి స్వాగత పత్రాలు సమర్పించారు. గ్రామంలోని పలు సంస్థలవారు మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. కార్యదర్శి శ్రీ కొప్పు వాసుదేవమూర్తి నివేదిక చదివారు. శ్రీయుతులు రేపాల బుచ్చిరామశేషయ్య (శేష్ఠి, గెల్లా కేశవరావు, పూటుకూరి ఉపేంద్ర గుప్త, బెల్లం కుమారస్వామి ప్రభృతులు గ్రంథాలయ అవశ్యకతపై ప్రసంగించారు

గ్రంథాలయ కార్యక్రమాలకు తోడ్పడిన వారికి, ఎక్కువ పుస్తకాలు చదివినవారికి శ్రీ బెల్లంకుమారస్వామి బహుమతి ప్రదానం చేశారు.

రాజెన్‌బాబు మృతికి సంతాపం వెలిబుచ్చుతూ తీర్మానించారు. శ్రీ జి. నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు.

శ్రీ సోమల చినసుబ్బయ్య విందు చేశారు.

విశాఖపట్నంలో పౌర సంక్షేమ సంఘం ఏర్పాటు

విశాఖపట్నం, మార్చి11—స్థానిక యువ కళామందిర్ ఆవరణలో ఇటీవల బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఆర్థిక క్లిష్ట పరిస్థితిలో సామాన్యప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడడానికి ఒక పౌర సంక్షేమ సంఘం ఏర్పాటు చేసే విషయం చర్చించడానికి ఈ సభ జరిగింది. శ్రీ వై. శంకరరావు అధ్యక్షత వహించారు.

సంఘం ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత గురించి శ్రీయుతులు ఎన్. సుబ్బారావు, ఇ సీతయ్యనాయుడు, ఎస్ పైడితల్లినాయుడు, కె శ్రీనివాసరావు, జగన్, అంగర వెంకట కృష్ణారావు, కె. ఎస్. శాస్త్రి, ఎస్. ఎ శాస్త్రి, వి. ఎస్. ఎస్. మూర్తి, ఆర్. సూర్యారావు, పి కృష్ణమూచారి ప్రభృతులు ప్రసంగించారు. 'సిటిజన్ వెల్‌ఫేర్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం' అనే పేరిట సంఘం ఏర్పాటు చేయడానికి తీర్మానించారు. శ్రీ ఎం. జి. కె. మూర్తి వందన సమర్పణ చేశారు.

శ్రీ ఏ. ఇ. నెయిలర్ మృతి

విజయవాడ, మార్చి 11 — గారపాటి గారేజి (1959) ఇంజినీర్ శ్రీ ఎ. ఇ నెయిలర్ తమ 52 వ ఏట ఈ నెల ఏడవ తేదీన ఇక్కడ మరణించారు.

ఆయన అందరి ప్రేమాదరాలను చూరగొన్న వ్యక్తి.

రావూరు సమీపంలో బస్సు అటకాయింపు

పొట్టిపాలెం గ్రామస్థులపై దౌర్జన్యం; 29 మంది అరెస్టు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నెల్లూరు, మార్చి 11— పొట్టిపాలెం గ్రామానికి చెందిన సుమారు 30 మంది నిన్న సాయంత్రం రావూరుకు నాలుగు పర్లాంగుల దూరంలో ప్రత్యర్థి గ్రూపుకు చెందిన ఎనిమిది మంది ప్రయాణ చేస్తున్న బస్సును అటకాయించి కొట్టారని అంటున్నారు.

రావూరునుంచి వీరుతిరిగి వస్తున్నారని తెలుసున్నవారి బస్సులో వుండడం తటస్థించిన పోలీసు పార్టీ జోక్యం చేసుకొన్నది.

గాయాలు తగిలినవారిని రావూరు తీసుకొచ్చి వైద్య చికిత్స చేశారు.

రావూరు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు జరుపుతున్నారు.

ఈ విషయమై పోలీసు సూపరింటెండెంట్‌కు వర్తమానం పంపారని తెలుస్తున్నది.

ఈ సందర్భంలో 20 మందిని గూడూరులో అరెస్టు చేశారు. మరొక తొమ్మిదిమందిని పొట్టిపాలెంలో అరెస్టు చేశారు.

గాయపడిన వారిని నేటి ఉదయం ఇక్కడకు తీసుకొచ్చారు. గాయపడినవారిలో పొట్టిపాలెం పంచాయితీ అధ్యక్షులు శ్రీ కె మల్లారెడ్డి, శ్రీయుతులు, చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి పల్లంరెడ్డి, రామచంద్రరెడ్డి, జి. శేషారెడ్డి గారలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జేర్చారు. మిగిలిన నలుగురని అవుట్ పేషేంట్స్‌గా చికిత్స చేస్తున్నారు.

పొట్టిపాలెం గ్రామంలో శాంతిభద్రతను కాపాడడానికి సాయుధ రిజర్వును పెట్టారు.

నెల్లూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకాశవాణి

బుధవారం, మార్చి 13

(శక 1884 ఫాల్గుణ 22)

విజయవాడ

357.1 మీ. (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-35 ప్రసార విశేషాలు, 6-45 భక్తిరంజని (హైదరాబాదు నుంచి రిలే), 6-55 సూక్తి ముక్తావళి 7-00 తెలుగులో వార్తలు, 7-15 నేటి విశేషాలు, 7-20 నవరంగిణి కిడంబి కార్యక్రమం, 7-30 ఎస్. వి. వి. జగన్నాథాచార్యులు, 8-00 ఆంగ్లమున వార్తలు, 8-15 దేశభక్తి గీతాలు, 8-30 హైదరాబాద్ ఎ వలె, మ॥ 11-30 రాష్ట్రగానం, 11-40 ఉన్నత పాఠశాలలకు, 12-10 భారతదేశం - చైనా భూతం రూపకం, 12-30 కార్మికుల కార్యక్రమం నూతన పరిశ్రమలు ప్రసంగం ఎస్. రామకృష్ణ, 1-00 మహిళా సమాజం, 1-30 లలిత సంగీతం: కె. ప్రియంవద, 1-50 తెలుగులో వార్తలు, సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-20 ప్రకాశరాయపేట గ్రామస్థుల కార్యక్రమం, ప్రకటనలు, దరలు, వాతావరణం, 7-00 తెలుగులో వార్తలు, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 నాటిక, 7-45 రణదుందుభి, 8-00 గజమేడ నాటిక రచన: బుచ్చిబాబు, 8-40 విరామ సంగీతం, 8-55 నేటి విశేషాలు, 9-00 ఆంగ్లమున వార్తలు, 9-30 ఆంగ్ల ప్రసంగం: ఇందిరాగాంధి - (ఢిల్లీనుంచి రిలే), 9-45 లలిత సంగీతం:

భారతీయ కళ

వైజ్ఞానికోత్సవాలు

మదాసు మార్చి 11—భారతీయ నాట్య మండలి (మదాసు) వైజ్ఞానికోత్సవాల సందర్భంలో మొన్న రెండవ తేదీన "దండ్రగుప్త" నాటకం, మూడవ తేదీన "పాండవోద్యోగ విజయాలు" అన్నామలై హాలులో ప్రదర్శింపబడినాయి.

ఈ రెండు రోజులు శ్రీయుతులు ముదిగొండ లింగమూర్తి, వి సూర్యనారాయణ (మదాసు షరీఫ్) గారలు ఉత్సవాలకు అధ్వర్యం వహించారు ఈ ఉత్సవాలలో ప్రఖ్యాత కళాకారులు అనేకమంది పాల్గొన్నారు.

మండలి సంస్థాపకులైన శ్రీ తిలక్ గారు కళా నైపుణ్యాన్ని పలువురు శ్లాఘించారు.

శ్రీ ఎం. ఆర్. కె. తిలక్ "వాణిక్య" పాత్రను, శ్రీ దూళిపాళ "దండ్రగుప్త" పాత్రను ఉత్తమంగా అభినయించారు. శ్రీమతి కళ్యాణి "మురా" పాత్రకు అన్ని విధాలా సరిపోయింది. "బిక్షగాడు"గా శ్రీ ఎం. రామనాథశాస్త్రి పాటలు బాగున్నాయి. గ్రీక్ హీరో "యాంటిగోనస్"గా శ్రీ పమిడిపాటి వారి వేషభాషలు పాత్రోచితంగా ఉప్పాయి.

భీమసేనునిపాత్ర చెప్పుకో తగినట్టుగా వున్నది శ్రీయుతులు పుటపాటి, పెళ్ళూరి యదోచితంగా నటించారు. శ్రీ పీసపాటి గానం బావుంది. శ్రీ తిలక్ వందన సమర్పణ చేశారు.

రాష్ట్ర ప్రజాసోషలిస్టు పార్టీ మహాసభలు

విజయవాడలో ఏప్రిల్‌లో జరపడానికి సన్నాహాలు

విజయవాడ, మార్చి 11—

విజయవాడ పట్టణ ప్రజాసోషలిస్టుపార్టీ కార్యకర్తల సమావేశము డా॥ డి. లక్ష్మణరావుగారి అధ్యక్షత మొన్న సమావేశమై ఈ క్రింది తీర్మానాలు చేశారు.

రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ మాసంలో విజయవాడలో జరపుటకు తీర్మానించాడు.

అఖిల భారత ప్రజాసోషలిస్టుపార్టీ కార్యవర్గ తీర్మానానుసారం సోషలిస్టుపార్టీతో మరల ప్రజాశక్తి ప్రాతిపదికపై ఉభయ పార్టీలూ విలీనీకరణ జరగవలెనని ఈ సమావేశం ఏకగ్రీవంగా అమోదించినది.

పట్టణంలో అంటువ్యాధులు ప్రబలంగా ఉన్న ప్రాంతంలో ఆరోగ్య విధులను సక్రమంగా నిర్వహించక పోవడమువలన విపరీత జననష్టము కలుగుతున్నది. అందుకు ఆరోగ్యశాఖవారు తక్షణం సరియైన కార్యక్రమం తీసుకొని పట్టణములో ప్రజల ఆరోగ్యము కాపాడవలయునని ఈ కమిటీవారు కోరుచున్నారు. రానున్న వేసవిలో ప్రజలకు ఇబ్బందిలేకుండా మంచినీటి పథకము తక్షణం అమలు జరపవలసినదిగా పురపాలక సంఘమువారిని కోరుతూ తీర్మానించారు.

కృష్ణా జిల్లా ఆటు, పాటల పోటీలు

ఏప్రిల్ 5 వ తేదీ నుంచి ఉయ్యూరులో ఏర్పాటు

వుయ్యూరు, మార్చి 11—ఉయ్యూరు శ్రీ లలిత కళా సమితి ఆరవ వార్షికోత్సవం సందర్భంలో ఏక పాత్రాభినయం, బ్యాడ్మింటన్ (డబుల్స్), కేరమ్సు (సింగిల్స్) సైకిల్ స్పీడ్, పరుగు, బిడ్డి, లలిత సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ యోగా పనాలలో పోటీలు ఏప్రిల్ 5, 6 7 తేదీలలో జరుగును. మార్చి నెల 30 వ తేదీలోగా దరఖాస్తులు "శివరావుమన్నే కార్యదర్శి, శ్రీ లలిత కళా సమితి ఉయ్యూరు" చిరునామాకు అందజేయాలి.



సోల్ ఏజెంట్లు: దాదా అండ్ కంపెనీ, 86, సైదియప్పు నాయిక్ వీధి. మద్రాసు-1





భారతీయ యాత్రా సంస్థల ప్రతినిధుల 12 వ వార్షిక సమావేశానికి కేంద్ర రవాణా కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఈ నెల ఏడవ తేదీన హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం చేసినప్పటి ఫొటో

గుడివాడ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం

గుడివాడ, మార్చి 10—స్థానిక హైస్కూలులో పూర్వ విద్యార్థిసంఘం వార్షికోత్సవం గుడివాడ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం గారి అధ్యక్షతన జరిగింది. సభా ప్రారంభంలో బాబు రాజేంద్రప్రసాద్ విద్యాదానానికి సంతాపం వెల్లడిస్తూ తీర్మానం చేశారు శ్రీయం. వి. ఎన్ బ్రహ్మానందం సభను ప్రారంభించారు. శ్రీయుతులు కె వి రాఘవరావు, గుత్తా వీరరాఘవులు, పద్ది మోహనరావు అల్లూరి వీరరాఘవయ్య, టి. ఎల్. నారాయణ, కోగంటి రాజబాపయ్య, కటారి సత్యనారాయణరావు ఉపన్యసించారు.

తదుపరి నాటికలు, మేక పాత్రాభినయం ప్రదర్శనలు జరిగాయి. మునిసిపల్ చైర్మన్ శ్రీ కోగంటి రాజబాపయ్య అటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచిపెట్టారు.

వచ్చే సంవత్సరానికి ఈ దిగువ వారిని కార్య నిర్వాహక సభ్యులుగా ఏకగ్రీవంగా యెన్నుకొన్నారు. శ్రీయుతులు కటారి సత్యనారాయణరావు (అధ్యక్షులు) జి. యస్. ఆర్. ఆంజనేయులు (కార్యదర్శి) సి బి. రంగనాథరావు, సి ఆర్. దాసు(సంయుక్త కార్యదర్శులు) యస్. వి. యన్. బ్రహ్మానందం (కోశాధికారి) కె. వి. రాఘవరావు, కె. రాజబాపయ్య. డాక్టరు ఎ. వి. రాఘవయ్య. డాక్టరు ఎ. నారాయణరావు, బోయిన అయ్యప్ప. డాక్టరు యస్. కటుంబరావు. టి. యల్. నారాయణ, జి. వీరరాఘవులు (సభ్యులు)

తాడేపల్లిగూడెం ప్రాంతంలో మద్యనిషేధం క్రింద 49 మంది అరెస్టు

తాడేపల్లిగూడెం, మార్చి11—అసిస్టెంట్ ప్రొహిబిషన్ అధికారి శ్రీ వి. వెంకటస్వామి, ప్రొహిబిషన్ సబ్‌ఇన్‌స్పెక్టరు శ్రీ ఎం. నాగభూషణం (పెంటపాడు) భద్రిరాజు, కొండెపాడు, కోడుమిల్లి, నారాయణపురం పాదంపూడి, పెంటపాడు, చిలకంపూడు, ఏలూరు, తాళ్లపాలెం, కేశవరం, గణపవరం, నిడమర్రు, రాయకు గ్రామాలపై దాడిచేసి 49 మందిని అరెస్టు చేశారు.

సారాకాపుకు వినియోగించు పాత్రలను, ఒక టిజను స్వాధీనం చేసుకొన్నారు.

క్రీడాభిరామం

గుడ్లవల్లేరు పాఠశాల వార్షిక క్రీడోత్సవాలు

గుడ్లవల్లేరు, మార్చి 11—శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు మెమోరియల్ హైయర్ సెకండరీ స్కూలు 19 వ వార్షికోత్సవం ఫిబ్రవరి 26, 27 తేదీలలో జరిగింది ఈ సందర్భంలో అటల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 670 మంది విద్యార్థులలోను 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ పొట్లూరి శేషాద్రిరావు (గుడ్లవల్లేరు పంచాయతీ అధ్యక్షులు)జాతీయ పతాకావిష్కరణ చేశారు. శ్రీ వి. వెంకట్రావు (అసిస్టెంటు ఇంజనీరు, కవుతరం) అటల పోటీలకు ప్రారంభోత్సవం జరిపారు.

బహుమతి ప్రదానోత్సవ సభకు శ్రీ వి ఆదినారాయణ (రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్, గుంటూరు) అధ్యక్షత వహించి, బహుమతి ప్రదానం చేశారు.

శ్రీ ఎన్. వీరయ్య చౌదరి (తూర్పు కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి) సభను ప్రారంభించారు.

ఈ హైస్కూలు తరపున లోగడ మిగిలిన స్పెషల్ ఫీజులనుంచి రూ 3000 లు, శ్రీ పి. ఆదినారాయణగారికి వేసిన పూలమాలను వేలంవేయగా, శ్రీపొట్లూరిశేషాద్రిరావు పాడినరూ 25 లను. స్కూలు ఎ. సి. సి. విద్యార్థులు గత డిసెంబరులో మల్లవోలు వెళ్ళి సోషల్ సర్వీసు చేసినందుకు ద్వితీయులుగా వచ్చిన సందర్భమున కప్పులతోపాటు వారిచ్చిన బ్యాటరీ లైటును వేలంవేయగా శ్రీ వల్లభనేని రంగయ్యచౌదరి (హైస్కూలు ప్రెసిడెంటు) 10 రూపాయలు మొత్తం చేర్చి దానిని కొన్న 3035 రూపాయలు నేషనల్ డిఫెన్సు ఫండు క్రింద శ్రీ వి ఆదినారాయణగారి కిచ్చారు.

గుడ్లవల్లేరు నెహ్రూ పథకుల సంఘ గ్రామాభివృద్ధి సంఘం వారు హైస్కూలులో బిల్డింగ్సు కట్టుకొనే నిమిత్తం 12 వేల రూపాయలు విరాళమిచ్చారు

హైస్కూలులో vi క్లాసు నుంచి xi క్లాసు వరకు ప్రతి సంవత్సరం టోటల్ ఫస్టు వచ్చినవారికి బహుమతులను ఇవ్వడానికి గాను శ్రీ పొట్లూరి శేషాద్రిరావు ఈ సంవత్సరం 150 రూపాయలను యిస్తూ, ప్రతి సంవత్సరం ఈ మొత్తం బహుమతులను ఇవ్వడానికి వాగ్దానం చేశారు హైస్కూలు అటల పోటీలలో బాలుర జూనియర్స్ చాంపియన్‌గా వచ్చిన జి అప్పలస్వామికి, బాలికల జూనియర్ చాంపియన్‌గా వచ్చిన పి భానుమతికి హైస్కూలు కమిటీ ప్రెసిడెంటు శ్రీ వల్లభనేని రంగయ్య చౌదరి చెరొక కప్పును బహూకరించారు.

1962 మార్చి ఎస్ ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షలలో స్కూలులో తెలుగులో ఫస్టుమార్కు టోటలు ఫస్టు వచ్చిన. టి రామకృష్ణకు ప్రతి సంవత్సరం డాక్టర్ గుడ్లవల్లేటి లక్ష్మణరావుగారు యిస్తున్న మెడల్సు రెడూ శ్రీ పి. ఆదినారాయణ బహూకరించారు. క్రీడా సంఘం కార్యదర్శి శ్రీ వి. వెంకట్రాద్రి నివేదికను చదివారు.

అటల అనంతరం బాలికల లెజీమ్ విన్యాసం, ఎ. సి. సి. పెరేడ్, బాలుర డ్రిల్ విన్యాసం అనేకంతరప్రదర్శనలు ప్రదర్శింపబడ్డాయి. బాలికలు భరత నాట్యాన్ని ప్రదర్శించారు. నాటికలుకూడా ప్రదర్శింపబడ్డాయి.

అటలలో గెలుపొందినవారు:

బాలుర సీనియర్ చాంపియన్‌షిప్: పి. భాస్కరరావు, ఎస్ పూర్ణచంద్రరావు (ఇరువురకు పాయింట్లు సమానంగా వచ్చాయి.)

బాలుర జూనియర్స్ చాంపియన్ షిప్: జి అప్పలస్వామి, (9వ తరగతి), బాలుర సబ్‌జూనియర్స్ చాంపియన్‌షిప్: పి గంగరాజు (ఎనిమిదవ తరగతి). బాలికల సీనియర్స్ చాంపియన్‌షిప్: ఎం. డి. షమీమా బేగమ్ (పదవ తరగతి), బాలికల జూనియర్స్ చాంపియన్ షిప్: పి. భానుమతి (ఏడవ తరగతి). బాలికల సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్: బి. వి. ఎల్. రాజ్యం, కమలకుమారి, (ఇరువురకు పాయింట్లు సమానంగా వచ్చాయి.) వివిధ పోటీలలో ఈ క్రిందివారు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నెగ్గారు.

సీనియర్స్ (బాలురు) 110 మీ హర్డిల్స్ బి. వి శేషగిరిరాజు, యస్. సాంబశివరావు; 100 మీ. పరుగు: యస్. పూర్ణచంద్రరావు, యస్. సాంబశివరావు 200 మీ. పరుగు: యస్ పూర్ణచంద్రరావు, పి. భాస్కరరావు. 400 మీ. పరుగు: పి. భాస్కరరావు యస్. గంగరాజు: 800 మీ. పరుగు: పి. భాస్కరరావు, యస్. గంగరాజు; హైజంప్: బి. వి. శేషగిరిరావు, ఎన్. నరసింహారావు. లాంగ్‌జంప్: యస్ గంగరాజు, యస్, సాంబశివరావు; హాప్ స్టెప్ అండ్ జంప్: పి భాస్కరరావు. యస్. పూర్ణచంద్రరావు; పోల్‌వాల్టు: యస్. నరసింహారావు, బి. నాగేశ్వరరావు; షాట్‌పుట్: యస్. గంగరాజు, బి. వి శేషగిరిరావు. డిస్కస్ త్రో: యస్ పూర్ణచంద్రరావు, యం కూర్మారావు; జావలిన్ త్రో: డి కృష్ణమూర్తి, కె. కాళహస్తి.

జూనియర్స్ (బాలురు) 110 మీ హర్డిల్స్: జె. అప్పలస్వామి, ఎం. డి. అజీజ్ రహిమాన్, 100 మీ పరుగు: ఎల్. సీతారామయ్య, ఎం డి. అజీజ్ రహమాన్. 200 మీ. పరుగు: ఎల్ సీతారామయ్య జె. రుక్మాంగదరావు 400 మీ. పరుగు: జె అప్పలస్వామి, జె రుక్మాంగదరావు, హైజంప్: జి. మహలక్ష్మీడు, వి. నారాయణరావు లాంగ్ జంప్: ఎల్. సీతారామయ్య. జి అప్పలస్వామి, హాప్ స్టెప్ అండ్ జంప్: జి.అప్పలస్వామి, జి. మహాలక్ష్మీడు షాట్‌పుట్: ఎం.డి అజీజ్ రహిమాన్, వి. నారాయణరావు. సబ్‌జూనియర్స్ (బాలురు) 75 మీ. పరుగు: పి గంగరాజు, ఎం మురళీకృష్ణ, లైమ్ పికింగ్: పి గంగరాజు, కె కోటేశ్వరరావు. మ్యూజికల్ చైర్స్: ఎ సుబ్బారావు, వి మల్లికార్జునరావు

సీనియర్స్ (బాలికలు) 75 మీ పరుగు ఎం డి. షమీమా బేగమ్, ఎ. అరుణకుమారి. 50 మీ. స్కిప్పింగ్: వి. చిన్నమ్మ ఎం. డి. షమీమా బేగమ్. బి, ఆర్. లిల్లీ పుష్పమ్.

జూనియర్స్ బాలికలు-75 మీ. పరుగు: పి. భానుమతి. వి. స్వర్ణకుమారి. 50 మీ. స్కిప్పింగ్: పి. భానుమతి. జి. జగన్ మోహిని, బాల్ త్రో: ఎ. ప్రమీలారాణి, ఎ. లీలాకుమారి. రన్నింగ్ లాంగ్ జంప్: పి. భానుమతి, జి. జగన్ మోహిని.

సబ్ జూనియర్స్ (బాలికలు): 75 మీ పరుగు: బి. వి. ఎల్ రాజ్యం, పి. లక్ష్మీ కాంతమ్మ, 50 మీ. స్కిప్పింగ్: యస్. కమలకుమారి, వి. సీతారామమ్మ, లైమ్ పికింగ్: ఎస్. కమలకుమారి, ఎమ్. విమలకుమారి, మ్యూజికల్ చైర్స్: బి. వి. ఎల్. రాజ్యం, పి. కృష్ణకుమారి,

ఉద్యోగులు - ఉద్యోగాలు

హైదరాబాద్, మార్చి 11—

శ్రీ జి వెంకటనాథాచారిని అగ్రికల్చరిస్టు స్టేషన్‌లో సూపరింటెండెంటుగా నియమించారు

శ్రీ ఎం. జి. వసంతరావును రూరల్ సోషియాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారు.

శ్రీ యస్.ఆర్ శంకరన్‌కు 21 రోజులు సెలవు మంజూరు చేశారు.

శ్రీ భాషా కబీర్ మొయినుద్దీన్‌ను శిక్షణ పూర్తయిన తరువాత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా గూడూరులో నియమించారు.

శ్రీ కె ఆర్. నరసారెడ్డిని స్టేషనరీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా హైదరాబాద్‌లో నియమించారు

శ్రీ వి. గోవిందమీనన్‌కు సెలవు మంజూరుచేశారు.

శ్రీ డి. రామదాస్‌ను పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సెక్రటరీగా నియమించారు.

శ్రీ నారాయణరెడ్డిని హైదరాబాద్ జిల్లా పరిషత్ సెక్రటరీగా నియమించారు

శ్రీ యుతులు యల్. పాండురంగమూర్తి 1963 మార్చి 16 వ తేదీన, హెచ్. ఎం ఎ. సిద్దికీ మే నెల 19 వ తేదీన, యస్. కె, దుర్గయ్య జూలై 12 వ తేదీన కె. సింహాద్రి ఆగస్టు 12 వ తేదీన, వి. వెంకట సుబ్బయ్య ఆగస్టు 30 వతేదీన, మహమ్మద్ నయీముద్దీన్‌ఖాన్ సెప్టెంబర్ 30 వ తేదీన, డి. రామకృష్ణయ్య నవంబర్ 12 వ తేదీన, వై. వి. రామారావు నవంబర్ 25 వ తేదీన పదవీ విరమణ చేస్తారు

శ్రీ డి. వి. కపాడియాను రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం లైబ్రేరియన్‌గా మరొకమూడు మాసాలు పాటు తాత్కాలికంగా నియమించారు.

శ్రీ ఎస్. ఎం. అస్కారి ఇక్వేరికి 40 రోజులు సెలవు మంజూరు చేశారు.

శ్రీ టి హెచ్. రంగారావును సెలవు నుంచి వచ్చాక వరంగల్ జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా నియమించారు.

శ్రీ కె సూర్యరావుకు రెండు నెలలు సెలవు మంజూరు చేశారు.

శ్రీ యస్. తాతారెడ్డిని సెలవు నుంచి వచ్చాక స్పెషల్ తహశీల్ దార్ (ల్యాండ్ ఎక్విజిషన్)గా విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో నియమించారు,

శ్రీ కె. కృష్ణమూర్తి, శ్రీ పాచివాల రామస్వామి గారలను తూర్పు గోదావరి జిల్లాలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేటుగా నియమించారు.

శ్రీ పేములను మెదక్ జిల్లా కలెక్టర్ పర్సనల్ అసిస్టెంట్‌గా నియమించారు.

శ్రీ సి. యస్. మాధవరావును తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆడిట్ ఆఫీసర్‌గా తాత్కాలికంగా నియమించారు.

శ్రీ గులాం మహబూబ్‌ను లోకల్ ఫండ్ అకౌంట్స్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా విశాఖపట్నం జిల్లా చేశారు.

శ్రీ వి టి. మల్లారెడ్డిని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా నియమించారు.

డాక్టర్ ఆసిక్ హుస్సేన్‌ను ఉస్మానియా వైద్యశాస్త్రాలలో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారు.

వయోజనులలో నిరక్షరాస్యత నిర్మూలన

గ్రామీణ వలంటీర్ దళాలు అందుకు కృషిచేయాలని డాక్టర్ వేపా ఉద్బోధ

కాకినాడ, మార్చి 11—జిల్లాలో ఇక్కడ తూర్పు గోదావరి జిల్లా సమన్వయ సంఘం సమావేశం జరిగింది. వివిధ శాఖలు, సమితులలో జరిగిన కృషిని జిల్లా కలెక్టర్ డాక్టర్ రామ్. కె వేపా సమీక్షిస్తూ గ్రామీణ ప్రాంతాలలో వయోజనులలో నిరక్షరాస్యతను నిర్మూలించవలసిన అవసరం ఎంతైనా కలదని వక్కాణించారు. గ్రామీణ వలంటీర్ దళాలు ఆ పవిత్ర కృషికి పాటుపడాలని ఆయన అన్నారు. గ్రామిక రక్షణ బ్యాంకులు ప్రతిమండలలో ప్రతి సమితిలోను పది గ్రామాలలో ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. జాతీయ రక్షణ నిధి సేకరణలో జిల్లాకు అగ్రస్థానం తీసుకురావడానికి కృషిచేసినందుకు కలెక్టర్ జిల్లా అధికారులను. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్‌లను అభినందించారు. జిల్లాలో రక్షణ నిధికి ఇంతవరకు 38 లక్షల రూపాయలు సేకరించారు.

జిల్లా పరిషత్ కార్యదర్శి శ్రీ టి. త్రియంబకం వివేచకులు సమర్పించారు

జిల్లా పౌరసంబంధాల అధికారి "సత్యమే జయతే" వార్తా చిత్రాన్ని ప్రదర్శించారు.

విశాఖపట్నంలో స్టేడియం నిర్మాణం

త్వరలోనే జరుగుతుందని శ్రీ అజిత్‌సింగ్ వెల్లడి

విశాఖపట్నం, మార్చి 11— ఆంధ్ర మెడికల్ కాలేజి వార్షిక క్రీడోత్సవాలు ఇటీవల ఇక్కడ జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ పి నరసింహారావు అధ్యక్షత వహించారు మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీ అజిత్‌సింగ్‌ను ప్రధాన అతిథిగా ఆహ్వానించారు. శ్రీమతి అజిత్‌సింగ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మానసిక వికాసంతో పాటు, శరీర దార్ఢ్యంకూడా పెంపొందించుకొనడంఎంతైనా అవసరమని శ్రీ అజిత్ సింగ్ ప్రసంగిస్తూ చెప్పారు. యువతరంవారు తమ శక్తి సామర్థ్యాలను వృద్ధిచేసుకొనడానికి తగు సౌకర్యాలు కల్పించాలని శ్రీ సింగ్ అన్నారు. విశాఖపట్నంలో స్టేడియం నిర్మించే ప్రతిపాదన కలదని, త్వరలో నిర్మాణం జరుగుతుందని శ్రీ అజిత్‌సింగ్ తమ ప్రసంగంలో వెల్లడించారు.

క్రీడావిభాగం కార్యదర్శి శ్రీ మురళీధర్ వార్షిక నివేదిక సమర్పించారు.

కుమారి విజయలక్ష్మి వందన సమర్పణ చేశారు.

శ్రీ ఆదినారాయణకు చాంపియన్‌షిప్ లభించింది. విద్యార్థినులలో చాంపియన్‌షిప్ కుమారి సాకినా భాయికి లభించింది.

శ్రీ సత్యపాల్‌కు అంగసౌష్ఠవంలో ప్రథమ స్థానం లభించింది.

పాఠశాలలలో సైన్స్ ప్రాక్టికల్స్

నిడదవోలులో ఉపాధ్యాయుల సమావేశంలో చర్చలు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నిడదవోలు, మార్చి 11— పశ్చిమ గోదావరి జిల్లా టీచర్స్ గిల్డ్ అధ్యక్షులు శ్రీ చేబ్రోలు లక్ష్మణరావు స్థానిక హైయర్ సెకండరీ స్కూల్‌లో మూడవ తేదీన శాస్త్రోపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

శ్రీ కె. శేషశాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. సుమారు 20 మంది ప్రధానోపాధ్యాయులు, శాస్త్రోపాధ్యాయులు చర్చలలో పాల్గొన్నారు.

ప్రస్తుతం అనేక పాఠశాలలలో సైన్సు పరికరాలు మృగ్యమైనందున, చిన్నతరగతులు విద్యార్థులు నిర్వహింపగల వివిధ రకాల ప్రాక్టికల్స్ ఏవో వివరంగా తెలుపవలసిన దున, ఈ సంవత్సరం వ్యవధి తక్కువైనందున ఈ సంవత్సరాంతపు పరీక్షలకు ఈ పద్ధతిని అమలు పరచడాన్ని నిలుపుదల చేయాలని డి వి. ఐ.వి కోరడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు.

రాష్ట్ర ట్రైయినింగ్ కాలేజిలోని ఎక్స్‌టెన్షన్ శాఖలవారు సైన్సు టీచర్స్ సెమినార్స్ నడపి ఈ విషయంలో అన్ని పాఠశాలలో అనుసరించి తగు ప్రణాళికను తయారు చేయించాలని కూడా సమావేశంలో కోరారు.

మునిసిపల్ వర్కుచార్జిడ్ సిబ్బంది వేతనాలు

పునర్వ్యవస్థీకరించిన స్కేల్స్‌ను వర్తింపచేయాలని అభ్యర్థన

హైదరాబాద్, మార్చి 11—ఆంధ్ర మునిసిపల్, లోకల్ బోర్డ్సు నేషనల్ వర్కర్స్ యూనియన్, విజయవాడ శాఖ అధ్యక్షులు శ్రీమతి ఆర్. మనోహరం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్యగారికి ఇటీవల ఇక్కడ ఒక మెమొరాండం సమర్పిస్తూ, మునిసిపాలిటీల యాజమాన్యం క్రింద పనిచేయు వర్కుచార్జిడ్ సిబ్బందికి కూడా పునర్వ్యవస్థీకరించిన వేతన స్కేలును వర్తింపచేయాలని అభ్యర్థించారు.

ఒకే తరహా పనిచేయు సిబ్బందికి రెండు రకాల వేతనాలు చెల్లించడం సముచితం కాదని కూడా ఆమె మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

వర్కుచార్జిడ్ సిబ్బందికి కూడా పునర్వ్యవస్థీకరించిన వేతనాలను అమలు జరపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్యను సానుభూతితో పరిశీలించగలమని మంత్రి చెప్పారు.

బస్తర్ జిల్లా ఆంధ్ర సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక

జగదల్‌పూర్, మార్చి 11— బస్తరు జిల్లా ఆంధ్ర సంఘం సర్వసభ్య సమావేశం ఇటీవల జగదల్‌పూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. శ్రీ కె. నారాయణమూర్తి అధ్యక్షత వహించారు, శ్రీ మంత్రాల ఉమామహేశ్వరరావు ప్రార్థనచేశారు. శ్రీ అయినం సుబ్బారావు కార్యదర్శి నివేదికను సమర్పించారు. 1963 వ సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు,

శ్రీయుతులు యస్. రామమూర్తి, అధ్యక్షులుగాను, అయినం సుబ్బారావు, ఉపాధ్యక్షులుగాను, వై. బాబూరావు కార్యదర్శిగాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా శ్రీ మల్లాది లక్ష్మీనారాయణగారు ఎన్నికైనారు. శ్రీయుతులు శేషగిరిరావు, సి వి. రమణమూర్తి, ఎం. ఆర్. వి. కృష్ణారావు, నుర్ల అప్పలస్వామి, టి. లక్ష్మీనరసింహం ఎమ్. తిరుపతిరావు, ఎన్. లక్ష్మణరావు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనారు. ఆడిటర్‌గా శ్రీ బస్సు బాలకృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

రిక్రైంచి చేసిన ప్రాథమికోపాధ్యాయులు

తిరిగి ఉద్యోగాలను కల్పించడానికి నిశ్చయించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞత

ఏప్రిల్ 20 వ తేదీన జరుపదలచిన నిరసన దినం విరమణకు నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, మార్చి 11—

నిస్పంద ప్రాథమిక విద్యా పథకం క్రింద లోగడ రిక్రైంచి చేసిన ప్రాథమికోపాధ్యాయులకు తిరిగి ఉద్యోగావకాశాలను కలిగించడానికి నిశ్చయించినందుకు రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ప్రభుత్వానికి తన కృతజ్ఞత తెలియజేసింది.

ప్రభుత్వ నిర్ణయం అమలుజరిగేటట్టు ప్రత్యేక శ్రద్ధ గైకొనవలసిందిగా రాష్ట్ర సంఘం అన్ని జిల్లా ఉప సంఘాలకు ఆదేశాలు పంపింది.

వచ్చే ఏప్రిల్ 20 వ తేదీన జరపడానికి తలపెట్టిన నిరసన దినాన్ని విరమించడానికి నిశ్చయించింది.

తెలంగాణా వతందార్ల సంఘం లక్ష రూపాయల విరాళం

తెలంగాణా వతందార్ల సంఘం జాతీయ రక్షణ నిధికి ఇప్పటివరకు లక్ష రూపాయలకు పైగా విరాళ మిచ్చినట్టు సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. లక్ష్మీనరసింహారావు నిన్న ఇక్కడ ప్రకటించారు.

సంఘం కేంద్ర కార్యాలయాలనుంచి 20,385 రూపాయలను పంపగా, వివిధ తాలూకాలకు చెందిన ఉపసంఘాలు మిగతా విరాళాన్ని ఆయా తాలూకా ట్రెజరీలకు పంపినవని ఆయన తెలియజేశారు.

మద్రాసు పర్యటన మంత్రి శ్రీ వి. రామయ్య మార్చి 11 వ తేదీన అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో రైల్వే లెవెల్ క్రాసింగ్స్ వద్ద కాపలా పెట్టడానికి కాగల పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని ఒక లేఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసిందని చెప్పారు.

ఉస్మానియా యూనివర్సిటీ బడ్జెట్టు

సెనేట్‌కు సమర్పణ

హైదరాబాద్, మార్చి 11— రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ అబ్బాసి మొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం 1963-64 సంవత్సరం బడ్జెట్‌ను సెనేట్‌కు సమర్పించారు.

వచ్చే ఏడాదిలో 1 07,86,000 రూపాయల ఆదాయం, 1,09,23 000 రూపాయల వ్యయం వుండగలదని అంచనా ఎయబడింది.

రెండవ ప్రణాళికలో మిగిలిపోయిన పథకాల నిమిత్తం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇంకా 19 లక్షల 67 వేల రూపాయలు ఇవ్వవలసి వున్నదని ఆర్థికశాఖ కార్యదర్శి తెలియజేశారు

రెండవ ప్రణాళికలో మిగిలిపోయిన పథకాలకు, మూడవ పథకాలలో కొత్త పథకాల నిమిత్తం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌నుంచి మొత్తం 57 లక్షల 26 వేల రూపాయల గ్రాంటు లభించగలదని ఆయన నివేదించారు.

మిలిటరీ, నౌకాదళాలకు రిక్రూట్‌మెంట్

నైనికనౌకాదళాలలో అభ్యర్థులను చేర్చుకోవడానికి రిక్రూటింగ్ పార్టీవారు మార్చి 13, 14 తేదీలలో విజయవాడ ట్రావెలర్స్ బంగాలాలో మకాం చేస్తారు. చేరగోరువారు ఆ తేదీలలో వారిని అక్కడ కలుసుకొనవచ్చును.

అవసరాలు: పదవ గరిష్ఠ వారి సైన్యంలో చేర్చుకొంటారు 17, 25 సంవత్సరాల మధ్య వయస్కులై వుండాలి.

ప్రత్యేక పనివారు, చాకళ్ళు, స్వీపర్లు, మంగళ్ళుగా చేరేవారి వయస్సు 35 సంవత్సరాల వరకు వుండవచ్చును.

మాజీ సైనికుల విషయంలో వయోపరిమితి 48 సంవత్సరాలు.

శారీరక యోగ్యతలు: రెగ్యులర్ ఆర్మీలో సైనికులుగా చేర